


'సోమశిల'లో నీటినిల్వ



అనంతసాగరం, జూలై 15: సోమశిల పూర్తిస్థాయి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారానికి డ్యాంలో 9.880 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 55 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలు వలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వం చివరి మూడేళ్లలో పంట కాలువల నిర్వహణకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో కాలువలన్నీ అధ్వానంగా మారాయి. ఫలితంగా నీటి యాజమాన్యం సక్రమంగా జరగక భారీగా నీటి వృథా జరిగింది. దాని ఫలితమే గతేడాది సాగు విస్తీర్ణం తగ్గింది. కొత్త ప్రభుత్వంలోనైనా కాలువల్లో పూడిక తీస్తారా? కష్టాలు తొలగుతాయా? అంటూ రైతాంగం ఆశగా ఎదురు చూస్తోంది. రైతుల కష్టాలను గమనించిన ఎమ్మెల్యేలు మాత్రం సీజన్ కన్నా ముందుగానే స్పందించి ఇరిగేషన్ శాఖ ద్వారా అంచనాలు తయారు చేయించారు. మొత్తంగా రూ.110 కోట్లు అవసరమని అంచనా వేయగా, ఓ ఈఈ స్థాయి అధికారి నిర్వాకంతో ఈ ప్రతిపాదనలను రూ.40 కోట్లకు కుదిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రభావం ఇప్పుడు ఎమ్మెల్యేలకు తిప్పలు తెచ్చిపెట్టింది.



రూ.110 కోట్ల ప్రతిపాదనలు

40 కోట్లకు కుదింపు

- 'ఇరిగేషన్'లో ఓ అధికారి నిర్వాకం
- జిల్లాలో వాస్తవ పరిస్థితులను పక్కన పెట్టిన వైనం
- ఆయన మూలంగా ఎమ్మెల్యేలకు తిప్పలు
- మూడేళ్లుగా పంట కాలువలను పట్టించుకోని వైసీపీ సర్కారు
- ఇప్పుడు చేద్దామంటే లేనిపోని కొర్రీలు

నెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువల్లో నీరు సజావుగా పారాలన్నా, చివరి ఆయకట్టు వరకు నీరు అందాలన్నా ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో పూడిక తీయాలి. అంతేగాక గుర్రపుడెక్క, గడ్డి తొలగించాలి. సాగులో ఇది కీలకం. సాధారణంగా సెప్టెంబరులో ఇరిగేషన్ అధికారులు కాలువల నిర్వహణ, మరమ్మతులు చేపట్టేవారు. అక్టోబరు నుంచి మొదలయ్యే దుక్కులకు ఇబ్బంది లేకుండా చూసేవారు. కానీ గత మూడేళ్ల నుంచి కాలువల ఓఅండ్ఎం పనులను వైసీపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో పూడిక తీయకుండానే మూడేళ్ల నుంచి పంటల సాగవుతున్నాయి. ప్రతీ ఏటా ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినా వాటిని ప్రభుత్వం తిరస్కరించింది. పూడిక తీయండంటూ రైతులు అప్పటి ఎమ్మెల్యేలను వేడుకున్నా ఫలితం దక్కలేదు. దీంతో కొన్నిచోట్ల చివరి ఆయకట్టుకు నీరు అందక ఇబ్బందులు పడ్డ రైతులు.. వారే సొంత డబ్బుతో కాలువల్లో పూడిక తీసుకున్నారు.



నెల్లూరు : గుర్రపుడెక్క, చెత్తతో నిండి ఉన్న గచ్చు కాలువ

● నీటి వృథా

కాలువల్లో పూడికతీయని కారణంగా గతేడాది సోమశిలలోని పది టీఎంసీల నీరు వృథా జరిగింది. ఏటా ఈ కాలువల్లో పూడిక తీతకు గట్టిగా అంటే రూ.15 కోట్ల నుంచి 20 కోట్లకు మించి ఖర్చు కాదు. కానీ మూడేళ్ల నుంచి అసలు కాలువలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఇందుకోసం భారీగా ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. పరిస్థితిని గమనించిన ప్రస్తుత ఎమ్మెల్యేలు ఇరిగేషన్ శాఖ అధికారులతో ఇప్పటికే సమీక్షించారు. ఏటా సెప్టెంబరులో పంపే ప్రతిపాదనలను ఇప్పటికే సిద్ధం చేశారు. కాలువలు, చెరువుల నిర్వహణకు ఓఅండ్ఎం కింద జిల్లా మొత్తం రూ.110 కోట్లు అవసరమవుతుందని అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు.

సంగం : గడ్డి, తుంగతో పూడిపోయిన పడమటిపాళెం బ్రాంచి కాలువ

● ఆ అధికారి మూలంగా కుదింపు

ఒక్క సెంట్రల్ డివిజన్ పరిధిలోనే రూ.60 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. మిగిలిన డివిజన్లకు మరో రూ.50 కోట్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. కానీ ఇరిగేషన్ అధికారుల్లో సమన్వయ లోపమో.. లేదా అంతర్గత పోరో...? తెలియదు గానీ ఆ ప్రభావం ఈ ప్రతిపాదనలపై పడింది. వారం క్రితం రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఓఅండ్ఎం ప్రతిపాదనలపై చర్చించేందుకు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్ఈలు, సీఈలను విజయవాడకు పిలిచారు. అయితే ఆత్మకూరు ప్రాంతంలో పనిచేస్తున్న ఓ ఈఈ స్థాయి అధికారి అప్పటికే ఉన్నతాధికారుల వద్ద ఉన్నారు. జిల్లాకు రూ.110 కోట్లు అవసరం లేదని, పనులు చేయకుండా డబ్బులు తినేసేందుకు ఇంత భారీ మొత్తంలో ప్రతిపాదనలు పంపారం టూ జిల్లా అధికారులపై ఫిర్యాదు చేశారు. అయితే జిల్లాలో వాస్తవ పరిస్థితులను మాత్రం ఆయన వివరించలేదని సమాచారం. గత ప్రభుత్వంలో జరిగింది కూడా ఇదే కావడంతో ఉన్నతాధికారులు కూడా ఆలోచనలో పడినట్లు ఇరిగేషన్‌శాఖలో చెప్పుకుంటున్నారు. ఆ క్రమంలోనే రూ.110 కోట్ల ప్రతిపాదనలను వెనక్కు పంపి, ఆ మొత్తాన్ని రూ.40 కోట్లకు కుదించినట్లు తెలిసింది. దీంతో మళ్లీ ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. దీని మూలంగా అన్ని నియోజక వర్గాల్లోనూ పూర్తిస్థాయిలో కాలువలను బాగు చేయడం సాధ్యపడదని ఇంజనీర్లు చెబుతున్నారు.

● ఎమ్మెల్యేల అసహనం

పంపిన ప్రతిపాదనలు తగ్గించడంపై ఎమ్మెల్యేలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదరు ఈఈ ఫిర్యాదుతో ఇదంతా జరగడంతో ఆయనపై ఎమ్మెల్యేలంతా ఆగ్రహంగా ఉన్నారు. తగ్గించిన వర్కులన్నింటి వివరాలను తమకు అందజేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలంతా ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

ప్రతిపాదనలు సిద్ధం

రానున్న వ్యవసాయ సీజన్‌కు సంబంధించి కాలువల్లో ఓఅండ్ఎం పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. తొలుత రూ.110 కోట్లకు అంచనాలు తయారు చేశాం. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని రూ.40 కోట్లకు తగ్గించి ఎస్టిమేషన్లు తయారు చేశాం. ఈ వివరాలన్నింటినీ ఎమ్మెల్యేలకు అందజేశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- పీ కృష్ణమోహన్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ

చరిత్రలో నిలిచేలా

రొట్టెల పండుగ

- 20 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
- అన్ని శాఖలు సమర్ధవంతంగా పని చేయాలి
- అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ

నెల్లూరు (సాంస్కృతికం) : మత సామరస్యానికి ప్రతీక అయిన రొట్టెల పండుగను ఈసారి చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో శాఖలు వారీగా నిర్వహించాల్సిన విధులపై మంత్రి దిశా నిర్దేశం చేశారు. 17 నుంచి 21వ తేదీ వరకు జరిగే రొట్టెల పండుగకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ ఏడాది రొట్టెల పండుగకు దేశం నలుమూల నుంచి 20లక్షల మంది భక్తులు వస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు, వసతులు కల్పించాలని నారాయణ సూచించారు. పార్కింగ్ ప్రదేశాలలోనూ మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ దర్గా ఆవరణలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ 5వేల మంది పారిశుధ్య కార్మికులను నియమించినట్లు తెలిపారు. దర్గా ప్రాంతాన్ని జోన్లుగా విభజించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, 2వేల మంది పోలీసులతో బందోబస్తు, స్వర్ణాల చెరువులో 45 మందితో గజ ఈతగాళ్లతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. 24/7 విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా, జనరేటర్లు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఉంటుందని, అగ్నిమాపక దళం 10 పంపుల ద్వారా స్వర్ణాల చెరువు నీటిని శుద్ధి చేయడం జరుగుతున్నారు. భక్తుల సౌకర్యార్థం 12 సురక్షిత తాగునీటి స్టాళ్లు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు, తరలివచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థలకు వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆనంద్, అదనపు ఎస్పీలు సౌజన్య, గాదె శ్రీనివాసరావు, కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద, ఎస్ఈ సంపత్‌కుమార్, సిటీ ప్లానర్ దేవకుమార్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, మత్స్య శాఖ ఏడీ నాగేశ్వరరావు, ఆర్డీవో మాలోలా, తహసీల్దారు సుబ్బారెడ్డిలతోపాటు టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రొట్టెల పండుగ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నారాయణ



విద్యుద్దీప వెలుగుల్లో దర్గా



స్వర్ణాల చెరువు ఘాట్‌లో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

భక్తుల సందడి

రొట్టెలపండుగకు ముందుగానే బారాషహీద్ దర్గాకు భక్తులు తరలివస్తున్నారు. బుధవారం నుంచి పండుగ ఆరంభం కానుండగా రెండు రోజుల ముందే దూరప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. దర్గా ప్రాంగణంలో ఉన్న స్వర్ణాల చెరువులో స్నానమాచరించి, వరాల రొట్టెలను మార్చుకుంటున్నారు. అనంతరం బారా షహీద్‌లను దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమవుతున్నారు. కాగా, పండుగ జరిగే ఐదు రోజుల్లో 17వ తేదీన సందల్‌మాల్, 18న బారాషహీద్ దర్గా గంధ మహోత్సవం, 19న రొట్టెల పండుగ, 20వతేదీ తలీపాతేహా, 21న ముగింపు సభ జరగనుంది.

- నెల్లూరు (సాంస్కృతికం)



● ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట) : రొట్టెల పండుగకు తరలివచ్చే భక్తుల కోసం ఆర్టీసీ సంస్థ 42 ప్రత్యేక సర్వీసులను నడపనున్నది. ఈ బస్సుల్లో సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నట్లు ఆర్ఎం జి విజయరత్నం తెలిపారు. కాగా, నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి షాహీద్ దర్గా పరిసర ప్రాంతాల వరకు పోలీసుల అనుమతుల ప్రకారం బస్సులను నడపనున్నారు. అలాగే ఏఎస్‌పేట, కసుమూరు దర్గాలకు కూడా బస్సులు తిప్పనున్నారు.

● నిరంతర విద్యుత్ సరఫరా : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ) : దర్గాలో నిరంతర విద్యుత్ సరఫరాకు పటిష్ట ఏర్పాట్లు చేశామని ఆ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. సోమవారం దర్గాను సందర్శించిన ఆయన అధికార సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. దర్గాలో 315కేవీ, 250, 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పా టు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే 125 కేవీ జనరేటర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. 5రోజుల పాటు జరిగే పండుగకు అధికారులను, సిబ్బందిని మూడు విడతలుగా ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట డీఈ శ్రీధర్, ఏఈ లక్ష్మీనారాయణ ఉన్నారు.

● ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు (హరనాథపురం) : బారాషహీద్ దర్గాలో ఏర్పాట్లను కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు సోమవారం పరిశీలించారు. పోలీసు కంట్రోల్‌రూం, స్వర్ణాలచెరువు ఘాట్, అన్నదాన కేంద్రాలను, వైద్యశిబిరాలు, రిసెప్షన్, మానిటరింగ్ సెంటర్‌లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నట్లు చెప్పారు.



స్వర్ణాల చెరువు ఘాట్‌లో రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

అందరి సహకారంతో

శాంతిభద్రతలు నెలకొల్పుతాం

- గంజాయి నిర్మూలనకు ప్రత్యేక ప్రణాళికలు
- ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటా : బాధ్యతల స్వీకరణలో ఎస్పీ

నెల్లూరు (క్రైం), జూలై 15 : జిల్లాలోని అందరినీ సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రత పరిరక్షణ, నేర నియంత్రణ, ట్రాఫిక్ తదితర సమస్యల పరిష్కారం వైపు అడుగులు వేస్తామని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) జి కృష్ణకాంత్ స్పష్టం చేశారు. నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 రోజుల గంజాయి నిర్మూలన విధానంలో భాగంగా జిల్లాలో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలను రూపకల్పన చేస్తామన్నారు. మహిళలపై జరిగే నేర నిర్మూలన, వారి సమస్యల పరిష్కారానికి అధికంగా ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడుతామని, సంఘ విద్రోహ శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. పోలీసులు వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం సబ్ డివిజన్, సర్కిల్ పోలీసు అధికారులు, ఎస్బీ, డీసీఆర్బి, పోలీసు కార్యాలయం సిబ్బంది, అన్ని విభాగాల సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి ఆనంకు మొక్క అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

● మంత్రులను కలిసిన ఎస్పీ

నెల్లూరు (క్రైం) : ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న జి కృష్ణకాంత్ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణలను వారివారి క్యాంపు కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను, జిల్లా జడ్జి యామినిని కూడా ఎస్పీ కలిశారు.

డయేరియా విజృంభణ!

● ఇప్పటికే 1600 కేసుల నమోదు ● ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు ● వసతి గృహాల్లో తనిఖీలు

నెల్లూరు(వైద్యం), జూలై 15 : జిల్లాలో డయేరియా(అతిసారా) వ్యాధి విజృంభిస్తోంది. ఎక్కడ చూసినా డయేరియా బాధితులతో ఆసుపత్రులు నిండుతున్నాయి. జనవరి నుంచి ఇప్పటివరకు 1600డయేరియా కేసులు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా విజయవాడ, గుంటూరు, తిరుపతి తదితర జిల్లాల్లో డయేరియాతో ఇప్పటికే 10మంది చనిపోయారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన రాష్ట్రప్రభుత్వం నివారణచర్యలు చేపట్టింది. ప్రస్తుతం జిల్లాలోని విడవలూరు మండలం రామతీర్థం, ముత్తుకూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలం యల్లాయపాళెం తదితర గ్రామాలలో డయేరియా కేసులు వెలుగు చూశాయి. ఎక్కువగా ఆహారం కల్తీ కారణంగానే వ్యాధికి గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. ఎక్కువగా చిన్నారులే ఈ వ్యాధికి గురైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో కూడా గురుకుల వసతి గృహాలలోని విద్యార్థులు ఉన్నారంటే అక్కడ పారిశుధ్య పరిస్థితి ఎలాఉందో అద్దం పడుతోంది. తాజాగా నెల్లూరు ఉమ్మడి జిల్లాలోని నాయుడుపేట గురుకుల వసతి గృహంలో 80మంది విద్యార్థులు ఆహారం కలుషితమై ఆదివారం రాత్రి ఒక్కసారిగా డయేరియాకు గురయ్యారు. వీరిలో ఎక్కువ మందిని సోమవారం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతున్న బాధిత విద్యార్థులను వైద్యాధికారులు పరిశీలించారు.

జిల్లాలో వైద్యశాఖ నమోదు చేసిన కేసులు

ఏడాది	నమోదు
2022	3200
2023	2500
2024 (జూన్ వరకు)	1600



నెల్లూరు బీసీ వసతి గృహంలో అధికారుల పరిశీలన

● జనవరి నుంచి...

ఇదిలా ఉంటే జనవరి నుంచి ఇప్పటి వరకు 1600 డయేరియా కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. వాస్తవానికి మరిన్ని ఎక్కువ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అప్రమత్తమైన వైద్యాధికారులు పంచాయితీరాజ్, నీటి నిర్వాహణ సంస్థతో కలిసి నీటి పరీక్షలు చేపడుతున్నారు. డయేరియా కేసులు నమోదైన ప్రాంతాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 1 నుంచి ఇంటింటికి తిరిగి స్పెషల్‌డ్రైవ్ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. గతంలో నెల్లూరు నగరంలోని కుసుమ హరిజనవాడ, బట్వాడిపాళెంలలో నీటి కలుషితం కారణంగా 70 మంది డయేరియాకు గురికాగా అందులో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన నుంచి ప్రజలు బయట పడుతున్న తరుణంలో తాజాగా డయేరియా కేసులు జిల్లాలో నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

డయేరియా నివారణకు ప్రత్యేక చర్యలు



జిల్లాలో డయేరియా వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటికి వెళ్లి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నాం. వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. డయేరియా కేసుల వివరాలు ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి ఎప్పటి కప్పుడు సేకరిస్తున్నాము. విద్యార్థులు ఉండే వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం.

- డాక్టర్ భాస్కర్, జిల్లా సర్వేలెన్స్ అధికారి

కలెక్టరేట్‌కు పోటెత్తిన ప్రజలు

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 217 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 15 : సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. మండలస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇక్కడికి 217అర్జీలు కలెక్టర్‌కు అందజేశారు. భూ సమస్యలు పరిష్కరించాలని, రేషన్ కార్డులు, పెన్షన్ మంజూరు చేయాలని, ఇలా అనేక సమస్యలపై అర్జీలు అందజేయగా పరిశీలించిన కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్, ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి పద్మావతి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు పాల్గొన్నారు.

● టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని నెల్లూరులో ఏర్పాటు చేయాలని సీపీఎం, ముస్లిం సంఘాల నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జియాఉల్‌హక్, రాష్ట్ర మైనార్టీ జేఏసీ నాయకులు షఫ్రక్ ఆసిఫ్ బాషా, సీపీఐ నెల్లూరు నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు హజ్రత్ టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని నెల్లూరు నగరంలో ఏర్పాటు చేయాలని కోరారు.

● టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని నెల్లూరులో పెట్టడానికి అనుమతి ఇవ్వవద్దని కోరుతూ బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి ముురగ నరేష్ యాదవ్‌లు వినతిపత్రం సమర్పించారు. జీవో-18 ప్రకారం బహిరంగ ప్రదేశాలలో, సెంటర్లలో ఎలాంటి విగ్రహాలు పెట్టరాదని ఉందన్నారు. హిందూ మత ద్రోహి టిప్పుసుల్తాన్ విగ్రహాన్ని నెల్లూరులో పెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని దీనిని బీజేపీ యువమోర్చా తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు.

● సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీసీ విద్యార్థి యువజన రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణయాదవ్ వినతిపత్రం సమర్పించారు.

జిల్లాలో మాతాశిశు మరణాలు నివారించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 15: జిల్లాలో మాతా, శిశు మరణాలు నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ అధికారులకు మాతాశిశు మరణాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, అసంక్రమిత వ్యాధులు గుర్తించి నివారించాలన్నారు. గ్రామాల్లో ఎంత మంది గర్భిణులు ఉన్నారో తెలుసుకుని వారికి వెంటనే వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీపీఎంవో డాక్టర్ రమేష్, డీపీవో రమేష్, డీపీహెచ్ఎన్‌వో మంజుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పెంచలయ్య

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 105 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), జూలై 15: నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 105 మంది ఫిర్యాదుదారులు తరలి వచ్చి వారి సమస్యలు పోలీసు అధికారులకు విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, మహిళల సంబంధిత సమస్యలు, కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్యా భర్తల వివాదాలు ఇలా అనేక సమస్యలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు వచ్చాయి. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చౌదరిపాళెం పాఠశాలలో విద్యార్థుల కరువు

● అయినా ఉపాధ్యాయురాలి హాజరు

● ఎంఈవో ఆదేశాలు బేఖాతర్

కావలి రూరల్, జూలై 15: మండలంలోని చౌదరి పాలెం ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులెవరూ రావడం లేదు. పిల్లలు బడికి రాకపోవడంతో ఆ పాఠశాల వెలవెలబోతోంది. అయితే ఉపాధ్యాయురాలు పద్మావతి మాత్రం ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి తలుపులు తీసి కూర్చుని, తిరిగి వెళుతున్నదని గ్రామస్థులు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గత నెలలో పాఠశాల పరిశీలనకు వెళ్లిన ఎంఈవో గోవిందయ్య ఒక్క విద్యార్థి కూడా లేకపోవటాన్ని చూసి విస్మయం వ్యక్తం చేశారు. గ్రామస్థులతో మాట్లాడుతున్నానని ఉపాధ్యాయురాలు చెప్పగా, టీచర్ల కొరత ఉన్న పాఠశాలకు తాత్కాలికంగా వెళ్లాలని ఆయన ఆదేశించారు. ఎంఈవో ఆదేశాలను ఆమె పెడచెవిన పెట్టింది.


● ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు : ఎంఈవో

మండలంలోని పడమట ఆర్వీపాలెం, చౌదరిపాలెం పాఠశాలల్లో విద్యార్థులు లేని విషయాన్ని గుర్తించాం. విద్యార్థులు ఎక్కువగా ఉండే మరో పాఠశాలకు వెళ్లాలని ఆర్వీపాలెం టీచర్‌కు సూచించగా ఆమె అక్కడకు వెళ్లింది. చౌదరిపాలెంలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు మాత్రం మరో పాఠశాలకు వెళ్లకుండా ఆర్డర్ కాపీ ఇస్తే వెళ్తానని పేర్కొంది. ఈ విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇరిగేషన్‌లో భారీగా అక్రమాలు

● ఎఫ్‌డీఆర్, ఓఅండ్ఎం మాటున దోచుకున్న వైసీపీ నేతలు ● ఆధారాలతోసహ సీఎంకు సోమిరెడ్డి లేఖ ● మంత్రి నిమ్మలకూ అందజేత.. విచారణకు ఆదేశం

నెల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : జల వనరుల శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆ లేఖను ఆదివారం నెల్లూరు పర్యటనకు విచ్చేసిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడుకు అందజేశారు. అనేక ఆధారాలను ఆ లేఖకు జత చేశారు. ప్రత్యేక సంస్థతో దర్యాప్తు చేయాలని సోమిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా అనేక ఇతర విషయాలను కూడా మంత్రికి వివరించారు. ఈ ఆధారాలను ప్రాథమికంగా పరిశీలించిన మంత్రి నిమ్మల.. అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. వెంటనే విచారణకు ఆదేశించారు. గత ఐదేళ్లలో జరిగిన ఇరిగేషన్ వర్కుల వివరాలను అందజేయాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ వర్కుల న్నిటిపై శాఖాపరమైన విచారణ చేయనున్నట్లు ఆదివారం జరిగిన అంతర్గత సమావేశంలో మంత్రి నిమ్మల ప్రకటించారు. ఈ విచారణ ఇప్పుడు అక్రమార్కుల్లో ఆందోళన కలిగిస్తోంది. అటు వైసీపీ నేతలు, ఇటు ఇరిగేషన్ అధికారుల్లో వణుకు మొదలైంది. అయితే ఇరిగేషన్‌లో వర్కులను చాలా వరకు వేరే కాంట్రాక్టర్ల పేరు మీద వైసీపీ నేతలు చేసి ఉన్నారు. ఇప్పుడు వారి కూడా తమ మెడకు ఎక్కడ అవినీతి ఉచ్చు ఇరుక్కుంటుందేమోనని భయపడుతున్నారు. ఇప్పటికే ఇరిగేషన్ శాఖలో ఇలా అక్రమంగా పెట్టిన బిల్లులను వెనక్కు తేవడం గమనార్హం.



ఇరిగేషన్ శాఖలో జరిగిన అక్రమాలపై మంత్రి నిమ్మలకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఇరిగేషన్ స్థలంలో ఇంటి నిర్మాణం

● నోటీసులు అందచేసి, కేసు నమోదు ● అయినా లెక్కచేయని ఆక్రమణదారుడు





ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో వేసిన పిల్లర్లు, ఆక్రమణ దారుడికి పంచాయతీ అధికారి అందచేసిన నోటీసు

సంగం, జూలై 15: మండలంలోని వెంకటేశ్వరపురంలో దువ్వూరు కాలువ వెంబడి ఖాళీగా ఉన్న ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో ఇటీవల ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి పునాదులు తీశాడు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ అధికారి నోటీసులు జారీ చేశారు. అయినా లెక్కచేయకుండా పనులు ప్రారంభించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. పంచాయతీ అప్రూవల్ లేకుండా నిర్మాణం చేపట్టడంతో నిర్మాణం నిలిపివేయాలని పంచాయతీ అధికారులు కూడా నోటీసు అందచేశారు. అయినా రెండు రోజుల నుంచి పిల్లర్స్ పనులు చేపట్టారు. దీంతో స్థానికులు మళ్లీ ఇరిగేషన్, పోలీసుల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం వారు సంఘటన స్థలానికి వెళ్లి అక్రమ నిర్మాణదారుడ్ని హెచ్చరించారు. అయినా లెక్కచేయకుండా యథావిధిగా పిల్లర్స్ వేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇరిగేషన్ పోరంబోకు స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకులం విద్యార్థిని మృతిపై విచారణ

● బాధితుల డిమాండ్లను కలెక్టర్‌కు నివేదిస్తా..



విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

రాపూరు(డక్కిలి), జూలై 15 : డక్కిలి బాలయోగి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి ని షరీనా మృతిపై తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం విచారణ చేపట్టారు. బాలిక మృత దేహానికి చెన్నైలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం వైద్యులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పచెప్పారు. కుమార్తె మృతదేహంతో తల్లిదండ్రులు స్వగ్రామం రాపూరుకు ఆదివారం చేరుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని ఖననం చేయబోమని వారు అధికారులకు తేల్చిచెప్పారు. దీంతో డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు, వెంకటగిరి సీఐ సంగమేశ్వరరావు రాపూరుకు వెళ్లి బాధితులకు నచ్చచెప్పారు. ఈ సందర్భంగా వారు కొన్ని డిమాండ్ల ను నేరవేర్చాలని కోరినట్లు తహసీల్దార్ తెలిపారు. కుటుంబంలో ఒకరి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతోపాటు, రూ25లక్షలు నగదు, మిగిలిన ఇద్దరు పిల్లలకు కార్పొరేటు విద్యను అందించాలని కోరినట్లు ఆయన వివరించారు. అంతేకాకుండా తమ బిడ్డ మృతికి కారుకులైన గురుకుల సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. బాధితుల డింమాండ్లతో పా టు విచారణ నివేదికను జిల్లా కలెక్టరుకు నివేదిస్తామని ఆయన హమీ ఇచ్చారు. దీంతో షరీనా మృతదేహానికి అత్యక్రియలు పూర్తిచేశారు.

గురుకులం ప్రిన్సిపాల్ సస్పెండ్: కాగా విద్యార్థిని షరీనా మృతికి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని భావిస్తూ ప్రిన్సిపాల్ శ్రీదేవిని సస్పెండ్ చేస్తూ తిరుపతి కలెక్టర్ వెంకటేశ్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నర్సు సునీత, హౌస్ కీపర్ వాణిలను కూడా సస్పెండ్ చేశారు.

వేదగిరి క్షేత్రంలో తిరుప్పావడ సేవ



నెల్లూరురూరల్, జూలై 15 : వేదగిరి లక్ష్మీనరసింహస్వామి సన్నిధి లో సోమవారం ఆలయ అర్చక బృం దం తిరుప్పావడ సేవ నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వేడుకను నిర్వహిం చారు. ముందుగా మూలావర్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో గిరికృ ష్ణ, ఆలయ ప్రధాన అర్చకుడు భాష్య రాచార్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పేర్ల తొలగింపు

చేజర్ల, జూలై 15: మండలంలోని యనమదల సచివాలయ నూతన భవనాలపై ఉన్న పే ర్లను ఎట్టకేలకు సోమవారం తొలగించారు. వివరాల మేరకు, యనమదలలో నూతనంగా నిర్మిం చిన సచివాలయ భవనాల స్థలం తమదని అంటూ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వా రి పేర్లను దాతలుగా భవనాలపై వేయించుకున్నారు. అయితే సదరు స్థలం ప్రభుత్వానిదంటూ గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. అయితే ఇటీవల గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనంకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈవో ఇచ్చిన ఆదేశాల మేరకు భవనంపై ఉన్న పేర్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీ ఆర్డీ రామయ్య, పంచాయితీ కార్యదర్శి దౌలత్ తదిత రులు పాల్గొన్నారు.



సచివాలయంపై పేర్లు తొలగిస్తున్న అధికారులు

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

సంగం, జూలై 15: సంగం గ్రామానికి చెందిన మాఘం వెంకటసుబ్బయ్య (65) దువ్వూరు చేపల గుంటల్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు, శనివారం ఉదయం ఆయన ఇంటినుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. గ్రామరైతు సోమవారం ఉదయం చేపలగుంటల వద్దకు వెళ్లగా మృ తదేహం తేలాడుతుండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనం తరం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వెళ్లి పరిశీలించి మృతుడిని వెంకటసుబ్బయ్యగా గుర్తించారు. పోలీసులు అను మానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆత్మకూరు వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



వెంకటసుబ్బయ్య (ఫైల్)

అల్లూరులో భారీ చోరీ

15 సవర్ల బంగారం, రూ1.75 లక్షల నగదు అపహరణ

అల్లూరు, జూలై 15: అల్లూరులో మరో భారీ చోరీ జరిగింది. 24 గంటలు గడవక ముం దే మండలంలో సోమవారం మరో దొంగతనం జర గడం పోలీసులకు సవాల్‌గా మారింది. బాధితుల కథనం మేరకు, అల్లూరుపేటకు చెందిన పల్లపోలు శ్రీనివాసులురెడ్డి కుటుంబ సమేతంగా గత గురువారం రాత్రి తిరుమలకు వెళ్లారు. తిరిగి సోమవారంవచ్చేసరికి తలుపు తాళం పగులగొట్టి ఉన్నారు. ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువా తెరచి అందులోని 15 సవర్ల బంగారు ఆభరణాలు, రూ1.50 లక్షలు నగదు, ఇతరులు ఇచ్చి పెట్టిన రూ.25 వేలు నగదు తీసుకొని దుండగులు ఉడాయించారు. దీంతో బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ శ్రీనివాసుల రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



చిందరవందరగా పడేసిన వస్తువులు

విద్యుత్ హెచ్చుతగ్గులతో గృహోపకరణాల దగ్ధం

కావలి రూరల్, జూలై15: పట్టణంలోని ముసునూరు చంద్రబాబునాయుడు కాలనీ సమీపంలో సోమవారం రాత్రి విద్యుత్ హెచ్చుతగ్గులతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయ ని బాధితులు పేర్కొన్నారు. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఆగిపోయి 7.30 ప్రాంతంలో సరఫరా కాగా హైవోల్టేజీ వచ్చిందన్నారు. దీంతో కాలనీలోని మల్లి అయ్యప్ప, మరొకరి ఇంట్లో రెండు ఇన్వర్టర్లు, మల్లి శ్రీను ఇంట్లో ఫ్యాను కాలిపోయాయన్నారు. కాగా విద్యుత్ హెచ్చుతగ్గులను అరికట్టేందుకు కాలనీలో అదనపు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దుకాణం ధ్వంసం

వరికుంటపాడు, జూలై 15: మండలంలోని గొల్లపల్లి ఎస్టీ కాలనీ సమీపంలోని ఓ దుకాణాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు బాధిత కుటుంబీకులు సోమవారం తెలిపారు. కాలనీకి చెందిన లోకసాని శ్రీను ప్రధాన రహదారి ప్రాంతంలో చిన్నపాటి దుకాణాన్ని ఏర్పా టు చేసుకొని జీవనం సాగించేవాడు. ఇటీవల పనుల నిమిత్తం ఆయన ఇతర ప్రాంతానికి వెళ్ల డంతో దుకాణానికి తాళాలు వెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి దుకాణం తలుపును పగు లకొట్టిన కొంతమంది అందులోని సామగ్రిని బయట విసిరేయడంతో పాటు పందిరిని సైతం ధ్వంసం చేసినట్లు వాపోయారు. అటుగా వెళ్లిన కుటుంబీకులు సంఘటనను గమనించి కాలనీ వాసుల తమ గోడు విలపించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పోలేరమ్మగుడి ఆక్రమణపై ఫిర్యాదు

కావలి,జూలై15: బోగోలు మండలం బోగోలు దళిత వాడలో ఉన్న పోలేరమ్మ గుడిని కొందరు స్థానికులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని దళితవాడ వాసులు తెలిపారు. ఈ మేర కు సోమవారం వారు ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆర్డీవో శీనానా యక్, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిలకు వినతిపత్రాలు అందచేశారు. దీనిపై స్పందిం చిన ఆర్డీవో తాను పరిశీలించి న్యాయం చేస్తానని చెప్పారు.

పిచ్చికుక్క కాటుతో గేదె మృతి

కొండాపురం : సాయిపేటలో సోమవారం పిచ్చికుక్క కాటుతో చూడి గేదె మరణించింది. మాధవరావుకి చెందిన గేదె రెండు రోజులక్రితం అనారోగ్యంగా ఉండటంతో స్థానిక పశువైద్యుడు పరిశీలించిన రేబిస్ లక్షణాలు ఉన్నాయని చెప్పారు. ఎన్ని మందులు వాడినా ఫలితంలేదని కూడా చెప్పడంతో గేదె మరణించింది.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

నెల్లూరు(లీగల్) : చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు కావడంతో పట్టిపాటి క్రిష్ణకు ఏడాది జైలు శిక్షతోపాటు పరిహారం కింద రూ.10లక్షలు చెల్లించాలని నెల్లూరు నగర స్పెషల్ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ టీ.సుయోధన్ సోమవారం తీర్పు చెప్పారు. నెల్లూరు నగరం కోట మిట్టకు చెందిన బళ్లారి సుధీర్ కుమార్ వద్ద వేదాయపాళెంకు చెందిన పట్టిపాటి క్రిష్ణ తన అవసరాల నిమిత్తం 2015 అక్టోబరు 23వ తేదీన రూ.5 లక్షల అప్పుగా తీసుకుని ప్రామసరీ నో ట్ రాసి ఇచ్చాడు. సదరు అప్పు తీర్చేందుకు 2018 ఏప్రిల్ 25వ తేదీన రూ.7.50 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును ఫిర్యాది అదే నెల 30వ తేదీన బ్యాంకులో ప్రజంట్ చేయగా అది చెల్ల లేదు. దాంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా 2018 మే 17వ తేదీన నిందితుడికి లీగల్ నోటీ సు ఇచ్చి కోర్టులో ఎన్ఐ యాక్ట్ కింద ప్రైవేట్ కంప్లయింట్ దాఖలు చేశాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	126
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	254
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6777
వెండి కిలో ధర	రూ. 94,500
వెండి ఒక గ్రాము	రూ. 96.50

నిరుపయోగంగా గోదాములు



గంగిరెడ్డిపల్లిలో నిరుపయోగంగా ఉన్న గోదాము

ఉదయగిరి రూరల్, జూలై 15: నియోజకవర్గంలోని అన్నిమండల కేంద్రాల్లో గత వైసీపీ ప్రభుత్వం రైతుల ప్రయోజనం కోసం సహకారశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వ్యవసాయ గోదాంలు నిరుపయోగంగా మారాయి. రైతులు పండించిన పంట ఉత్పత్తుల నిల్వ కోసం రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. ఇప్పటివరకు భవనాన్ని అందుబాటులోకి తీసుకురాలేదు. ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లి, దుత్తలూరు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో, వరికుంటపాడు, వింజమూరు, సీతారామపురం, జలదంకి, కొండాపురం, కలిగిరి మండలాల్లో 500మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను రూ.40లక్షల వ్యయంతో నిర్మించారు. కొన్నిమండలాల్లో గోదాంల నిర్మాణ బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో పూర్తిస్థాయిలో నిర్మాణాలు పూర్తికాలేదు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణం పూర్తయి నిరుయోగంగా ఉన్నాయి. అధికారులు స్పందించి గోదాంలు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయోజనం చేకూరేనా..

గ్రామాల్లో నిర్మించిన వ్యవసాయ గోదాములతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందా అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేనప్పుడు రైతులు తమ ఉత్పత్తులను అక్కడ అద్దె రూపంలో నిల్వ ఉంచుకునేలా విధివిధానాలు ఉన్నాయి. ఈ భవనాల సామర్థ్యం 500మెట్రిక్ టన్నులే కావడంతో ఎక్కువ మంది రైతులకు అది ఉపయోగపడటం లేదు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో అధికంగా ఆరుతడి పంటలు సాగుచేస్తారు. దిగుబడిని రైతులు ఎప్పటికప్పుడు విక్రయిస్తుంటారు. ఈ గోదాములు రైతులకు ఎంతమాత్రం ఉపయోగపడతాయో వేచి చూడాల్సిందే మరి.

తప్పిన ప్రమాదం

వింజమూరు, జూలై 15: నెల్లూరు నుంచి పామూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వింజమూరు చెరువు కట్ట మరో బస్సుని క్రాస్ చేయబోయి వేగంగా రోడ్డు దిగింది. డ్రైవర్ చాకచక్యంగా బస్సును కంట్రోల్ చేయడంతో ఒక పక్కకు ఒరిగి నిలిచిపోయింది. ఈ సంఘటనలో ప్రయాణి కులంతా భయాందోళన చెందారు.

మొక్కజొన్న విత్తనాల పంపిణీ

వింజమూరు, జూలై 15: కాటేపల్లి రైతుసేవాకేంద్రంలో సోమవారం రైతులకు పశుసంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో జొన్న, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొమ్మి కోటేశ్వరరావు పాల్గొని రైతులకు పలు సలహాలు, సూచనలను అందించారు. పాల దిగుబడిని ఈ పశుగ్రాసం ద్వారా పెంచుకో వచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 15: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అంటు వ్యాధులు దరిచేరవని నర్రవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి హరీష్ తెలిపారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల్లో సోమవారం నర్రవాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటి పరిసరాలు, టైర్లు, పూలకుండీలు, ప్లాస్టిక్ వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడితే కీటక జనిత వ్యాధులు (మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా) వంటి జ్వరాల బారి నపడకుండా ఉండవచ్చన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్‌అధికారి నౌషాద్‌బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, షఫీ, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్డులకు దరఖాస్తు చేసుకోండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 15: భూయజమానులకు నష్టం కలుగకుండా ప్రభుత్వం అందజేసే కౌలురైతు గుర్తింపు కార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి తెలిపారు. సోమవారం వెంకటంపేట రైతు సేవాకేంద్రంలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. 11నెలల కాలపరిమితి కలిగిన కౌలురైతు గుర్తింపుకార్డుతో అనేక ప్రయోజనాలు పొందవచ్చన్నారు. విపత్తుల్లో పంట నష్టపోతే పరిహారం, పంట రుణాలు, బీమాతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాల ప్రభుత్వం అందజేసే రైతు భరోసా పథకానికి అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో ఏవో వెంకటసుబ్బారెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, వీపీఏ సుజాత, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి

ఉదయగిరి రూరల్, జూలై 15: పట్టణంలోని చెరువు ఆనకట్ట సమీపంలోని గంగమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని సోమవారం ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తహసీల్దారు నెహ్రూబాబుకు విన్నవించారు. ఆలయం శిథిలావస్థకు చేరడంతో గతేడాది దాతల సహకారంతో నూతన నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. అయితే అధికారులు ఆలయ నిర్మాణ స్థలం పర్యాటకశాఖకు చెందినదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్థలాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించి న్యాయం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, ఆలయ కమిటీ సభ్యులు బొజ్జా నర సింహులు, శ్రీనివాసులు, పెదవెంకటయ్య, మేస్త్రీ వెంకటేశ్వర్లు, నాగయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి

ఉదయగిరి రూరల్, జూలై 15: గంగిరెడ్డిపల్లికి చెందిన కలమకూరి మల్లేశ్వరి, శ్రీనివాసులు, శేషారెడ్డికి చెందిన ఒక గేదె, మూడు దూడలు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మూడురోజుల క్రితం అటవీ ప్రాంతానికి మేతకెళ్లాయి. గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి గేదెలు మృతి చెందాయని బాధితులు వాపోయారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందన్నారు.

ఉర్దూ పాఠశాల ఆకస్మిక తనిఖీ

సీతారామపురం, జూలై 15: రంగనాయుడుపల్లిలోని ఉర్దూ పాఠశాలను సోమవారం ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పాఠశాలకు ప్రార్థనా సమయానికి హాజరై విద్యార్థులకు సూచనలిచ్చారు. పేదరికం పోవాలంటే విద్యార్థులు బాగా చదువుకొని 100శాతం మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌ను అందజేశారు. ప్రాథమిక మెయిన్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యం, ఉర్దూ నోట్స్, మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తురకపాలెంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించి బ్యాగులను అందచేశారు. ఆయన సీఆర్పీ ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రైతు సేవా కేంద్రంగా బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

ఉదయగిరి రూరల్, జూలై 15: పట్టణంలోని రైతు భరోసా కేంద్రం-1ను అధికారులు సోమవారం రైతు సేవా కేంద్రంగా పేరు మార్చి బోర్డు ఏర్పాటు చేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రభుత్వ ఉత్తర్వులు వీరికి పట్టవా' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ.చెన్నారెడ్డి సిబ్బందిచే రైతు సేవా కేంద్రంగా బోర్డు ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ బోర్డులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



ఆత్మకూరు : అన్నదానం చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ షేక్ గౌసబాష

ఆత్మకూరు, జూలై 15: ఎల్ఆర్‌పల్లి పీర్ల చావిడి వద్ద సోమవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీర్ల పండగ సందర్భంగా మూడవరోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మధ్యా హ్నం అన్నదానాన్ని మున్సిపల్ కౌన్సిలర్ షేక్ గౌస్‌బాష ప్రారంభించారు.

అనంతసాగరం : మండలంలోని సోమశిల, ఉప్పలపాడు, అనంతసాగరం, ముస్తాపురం, పీడీపల్లి, ఆమనిచిరివెళ్ల, కేడీపల్లి గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. పీర్లచావిడి వద్ద పీర్లను ఏర్పాటు చేసి ప్రత్యేక పతేహా నిర్వహించారు.

అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్



ఉదయగిరిలోని పంచాయతీ బస్టాండ్‌లో స్తంభించిన ట్రాఫిక్

ఉదయగిరి రూరల్, జూలై 15: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్, మెయిన్‌బజార్, గండిపాళెం మార్గంలో వాహనదారులు తమ వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో యజమాని కారును రోడ్డుపైనే నిలిపి వెళ్లడంతో ట్రాఫిక్ స్తంభించింది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు రోడ్డు మీద అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తుండడంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఆ సమయంలో పోలీసులు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకుంటాం



నేతలు ఆక్రమించిన పేదల ఇళ్లస్థలం

చేజర్ల, జూలై 15 : మండలంలోని అదురుపల్లిలో కాలనీ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కే. గోపికృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదురుపల్లిలోని ఆదూరమ్మ ఆలయానికి దక్షిణవైపున ఉన్న 2.20 ఎకరాలను పేదల ఇళ్ల కోసం ప్రభుత్వ కొనుగోలు చేసిందని, ఈ నేపథ్యంలో అక్క డ కొంత స్థలంలో కాలనీ కూడా నిర్మాణం చేశారని తెలిపారు. అయితే ఖాళీగా ఉన్న స్థలాన్ని గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నేతలు సేద్యం చేయించి వంగ చెట్లు నాటించారని మంత్రి ఆనంకు పలువురు ఫిర్యాదు చేశారన్నారు. మంత్రి ఆదేశాల మేరకు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి



నగదు ఇస్తున్న పూర్వ విద్యార్థులు

ఏఎస్‌పేట, జూలై 15: స్థానిక ఠాగూర్ పాఠశాల పూర్వ విద్యార్థులు మధుసూదన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి ప్రతి ఏటా పాఠశాలలో 10వ తరగతిలో మొదటి స్థానం సాధించిన వారికి నగదు బహుమతి అందచేస్తున్నారు. అలాగే 2023-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో మొదటి స్థానం సాధించిన వీ యశితకు సోమవారం రూ. 10వేల నగదు బహుమతిని, షీల్డ్‌ను అందచేశారు. ఇంగ్లీషు ఉపాధ్యాయుడు నాగభూషణం తన సతీమణి సత్యవతమ్మ జ్ఞాపకార్థం నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాల విద్యార్థి కే మోహన్ నరేంద్రకు రూ. 10వేల నగదు,షీల్డ్ అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణారెడ్డి, హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయు లు,విద్యార్థులు పాల్గొన్నారు.

పెయింటింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉదయగిరి, జూలై 15: నిరుద్యోగ యువతీ, యువకులకు న్యాక్ ఆధ్వర్యంలో పెయింటింగ్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు లక్కినేని ప్రకాష్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెయింటింగ్, డ్రాయింగ్, లెటర్ రైటింగ్, ఫిగర్ వర్కులో శిక్షణ ఇవ్వబడుతుందని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్:91773 27797 అనే నెంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సహజ సంపదలను దోచుకుంది వైసీపీ నేతలే..

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 15: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో సహజ సంపదలు (ఇసుక, మట్టి, తెల్లరాయి)ని అక్రమంగా రవాణా చేసి వైసీపీ నేతలు కోట్లకు పడగలెత్తారని దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు తెలిపారు. సోమవారం దుత్తలూరులో టీడీపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహజ సంపదలను దోచేసి రాష్ట్ర ఖజానాకు తీవ్రనష్టం కలిగిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. అక్రమ రవాణాకు పాల్పడి డబ్బు సంపాదించాలనే ఆలోచన టీడీపీ నాయకులది కాదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత వైసీపీ పాలనలో అక్రమాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తీసుకొస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, అన్నపురెడ్డి చినవెంగళరెడ్డి, సింగవరపు వెంకటేశ్వరరెడ్డి, చిన్నపురెడ్డి పాల్గొన్నారు.

కౌలురైతులకు అవగాహన సదస్సు

జలదంకి, జూలై 15: కౌలురైతులకు మండల వ్యవసాయాధికారిణి శైలజ సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలురైతులు ఈ-గుర్తింపుకార్డులు పొందేందుకు కావాల్సిన అర్హతలపై వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతు లు, వీఆర్వోలు, వీపీఏలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎవరినీ వదిలం



రైతులతో కలిసి ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, జూలై 15: ప్రభుత్వ భూములు ఆక్రమించి లేఅవుట్లు వేసినా, ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా ఎవరినీ వదిలేదిలేదని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఆయన పాల్గొన్నారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు త్వరగా పరిష్కరించమని ఆర్డీవోకి చెప్పారు. కావలి పాతూరుకు చెందిన రైతులు తమ పొలాల్లో ఉన్న పంట కాలువలు, గుంటలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని కాపాడాలంటూ ప్రదర్శనగా ఆర్డీవో కార్యాల యానికి వచ్చారు. వారి సమస్యలు తెలుపుతూ ఆర్డీవోకు, ఎమ్మెల్యేకు వేర్వేరుగా అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలన్నీ కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు అధికారులకు తెలిసే జరిగినందున, వాటిని కాపాడుకునేందుకు వారు వెనుకాడుతున్నారన్నారు. వారు కాక పోయినా, రేపు కొత్త అధికారులు వస్తారని అప్పుడు ఆక్రమణల బాగోతమంతా వెలికి తీస్తామన్నారు. జగనన్న కాలనీల్లో వైసీపీ నేతలు మైనర్ పిల్లల పేరుపై కూడా నివేశనస్థలాల పట్టాలు పొంది ఉన్నారన్నారు. వాటిపై విచారణ జరిపిస్తామని పేర్కొన్నారు.

● మొహర్రం ప్రార్థనల్లో ఎమ్మెల్యే కావ్య

కావలి టౌన్: పట్టణంలోని జెండాచెట్టు పీర్ల చావిడి వద్ద సోమవారం జరిగిన పీర్ల ఉత్సవాల్లో ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ప్రార్థనలు చేసి, అనంతరం అన్నసంతర్పణను ప్రారంభించారు. దర్గా అధ్యక్షుడు ముస్తఫా అధ్యక్షతన ఉత్సవాలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో మైనార్టీ నేతలు అర్షియా, ఖాదర్‌బాషా, రఫీ, రహీం, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పొట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● రామానాయుడు మృతికి ఎమ్మెల్యే కావ్య సంతాపం

జలదంకి : బీకే అగ్రహారం టీడీపీ సీనియర్ నాయకుడు కంచర్ల రామానాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి, బ్రాహ్మణక్రాక ఉపసర్పంచి దగుమాటి మాల్యాద్రిరెడ్డి ఉన్నారు.

అల్లూరు అల్లుడిగా రుణం తీర్చుకుంటా..!

అల్లూరు, జూలై 15: ఈ ఊరి అల్లుడిగా తనను ఆదరించి గెలిపించిన అల్లూరు గ్రామస్థుల రుణం తీర్చుకుంటానని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం సాయంత్రం నిర్వహించిన స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరు మండల ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారని, ఇందుకు అల్లూరు అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దారు దుర్గేశ్వరరావు, నాయకులు బండి అమర్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలి

ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత తొలిసారిగా అల్లూరుకు వచ్చిన కావ్య కృష్ణారెడ్డి సోమవారం సాయంత్రం అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ అధికారి ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండి పనులు చేసిపెట్టాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకు గోదాము స్థలం కబ్జాకు యత్నం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అల్లూరు, జూలై 15: స్థానిక డీసీసీబీ శాఖకు చెందిన గోదాము స్థలాన్ని అలూరుకు చెందిన ఓ వ్యక్తి కబ్జాకు యత్నించారు. దీంతో ఆ బ్యాంకు డీజీఎంలు మధుఎసూధనరావు, దయాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్యాంకు గోదాము స్థలాన్ని ఇతరులు ఆక్రమించేందుకు శుభ్రం చేశారని సమాచారం అందడంతో పరిశీలించేందుకు తాము వచ్చామన్నారు. ఎవరైనా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మేనేజరు స్వప్న, అల్లూరు పీఏసీఎస్ సీఈవో రాధయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరికి పాస్టర్ల సత్కారం



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సత్కరిస్తున్న పాస్టర్లు

కందుకూరు, జూలై 15: ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును సోమవారం నియో జకవర్గంలోని పాస్టర్లు ఘనంగా సత్కరించారు. ఐదు మండలాలకు సంబంధించిన పాస్టర్లు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఆయన్ను ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఆశీ ర్వదించారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన మీరు పాలనలోనూ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాస్టర్లు గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి), జడ ఆంతోని బాబు, శ్యామ్, జోషఫ్‌కుమార్, కాలేబు, యాకోబు, దేవకుమార్, లాబాను, యేసుదాస్, సామ్యేలు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో లింగసముద్రం పీహెచ్‌సీకి ప్రథమస్థానం

లింగసముద్రం,జూలై 15: రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఇటీవల ప్రకటించిన గ్రేడ్లలో లింగసముద్రం పీహెచ్‌సీ జిల్లాలో మొదటిస్థానం, రాష్ట్రంలో 285వ స్థానం పొందింది. దీంతో పలువురు జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టరు పీ రమేష్, డాక్టర్ ఏ అనూరాధ, సీహెచ్‌వో జీ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ గుర్తింపు లభించిందన్నారు.

చెట్లలోకి దూసుకెళ్లిన బస్సు : తప్పిన ప్రమాదం



మోచర్ల వద్ద చెట్లలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

గుడ్లూరు, జూలై 15: మండలంలోని మోచర్ల దగ్గర జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు చెట్లల్లోకి దూసుకువెళ్లింది. విజయవాడ నుంచి తిరుపతికి 36 మంది ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు మోచర్ల దగ్గరకు రాగానే, కురుస్తున్న వర్షంతో రోడ్డు కనిపించక చెట్లల్లోకి దూసు కెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగ్గపోవడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఇతర బస్సుల్లో ప్రయాణికులను వారివారి గమ్యస్థానాలకు చేర్చారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడపడం నేరం

కావలిటౌన్, జూలై 15: హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం నేరమని లోక్ అదాలత్ చైర్మన్ ఎం. శోభ పేర్కొన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదుల గుమాస్తాల సంఘం హాలులో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి, వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఈ సుధాకర్, ప్రత్యేక న్యాయాధికారి పరుశురామ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్‌అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, న్యాయవాదుల గుమాస్తాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రణీత్‌కు జాతీయ అవార్డు



జాతీయ అవార్డును అందుకుంటున్న ప్రణీత్

కావలి, జూలై 15: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ టీంసేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు నల్లిపోగు ప్రణీత్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపక దినం సందర్భంగా సోమవారం తమిళనాడు రాష్ట్రంలోని ఊటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆయనకు అందచేశారు. ఈ అవార్డుకు దేశవ్యాప్తంగా నలుగురిని ఎంపిక చేయగా, వారిలో ప్రణీత్ ఒకరు. ఈ పురస్కారాన్ని స్ప్రింగ్‌డే యూనివర్శిటీ ఆచార్యులు డాక్టర్ జేమ్స్, ప్రొఫెసర్ పార్థసారధి చేతుల మీదుగా అందుకున్నారు.

పాఠశాలకు బల్లల అందచేత



పాఠశాలకు బల్లలు అందచేసిన గ్రామస్థులు

ఉలవపాడు, జూలై 15: పెద్దపట్టపు పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు అవసరమైన బల్లలను సోమవారం గ్రామస్థులు ప్రధానోపాధ్యాయుడు ఎస్కే సలీంబాషాకు అందచేశారు. గ్రామానికి చెందిన ఆవల వాసు, తూపిలి రమేష్, ఊటుకూరి రాంబాబు, వాయల తిరుపతిరావు, లూపిలి శ్రీనివాసులు, గణిత ఉపాధ్యాయిని నీరజ తదితరులు కలిసి బల్లలు అందచేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాలలో సమావేశ మందిరం నిర్మాణానికి గ్రామ పెద్దలు ఆవల రఘురామయ్య, ఏడుకొండలు, వెకంటేశ్వర్లు, నరసింహ, అంకయ్య భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

కందుకూరు, జూలై 15: పట్టణంలోని ఏకలవ్యనగర్ ప్రాంతంలో నివసిస్తున్న పేదల్లో అనేకమందికి ఆధార్‌కార్డులు లేవు. ఈ సమాచారంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఉదయం పదిన్నర నుంచి ఆ ప్రాంతంలో ఆధార్‌కోసం స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేయించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిసింది. నియోజకవర్గంలో ఆధార్ లేనివారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేతలు పేర్కొన్నారు.

కలిగిరమ్మకు ప్రత్యేక పూజలు

కలిగిరి, జూలై 15: కలిగిరి గ్రామదేవత తిరునాళ్లలో రెండోరోజు సోమవారం పాపనముసిలిపాలెంలో గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని కలిగిరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాపన వంశస్థులు వీరతాళ్లకు ప్రత్యేక పూజలు చేసి, పాపనముసిలిపాలెంలో గ్రామోత్సవం నిర్వహించారు.

ముళ్ల చెట్ల తొలగింపు



ముళ్లచెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

బిట్రగుంట, జూలై 15: బోగోలు మండలం జక్కేపల్లిగూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళచెట్ల తొలగింపును సోమవారం చేపట్టారు. మండల తెలుగు రైతు అధ్యక్షుడు కరిపిరెడ్డి సుబ్బారెడ్డి సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాక రోడ్డుపై ఉన్న గుంతల్లో గ్రావెల్ కూడా వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు తలకాయల క్రిష్ణయ్య, కే.కృష్ణారెడ్డి పేరం క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగపెట్టె ఊరేగింపు

బిట్రగుంట, జూలై 15: బోగోలు యాదవపాలెంలో పోలేరమ్మ, గంగమ్మ తిరునాళ్లు ముగిసి నెల పూర్తి కావడంతో స్థానికులు సోమవారం రాత్రి బొల్లిఆవులు, గంగపెట్టె ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, తప్పెట్ల మోత, యువత వీరతాళ్ల నృత్యాల మధ్య గ్రామంలో ఊరేగింపు జరిగింది.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ఆత్మకూరు, జూలై 15 : గురుపౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు నుంచి అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వతేదీ ఉదయం ఆత్మకూరు నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకుని భక్తులు అరుణాచలంకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. టికెట్ ధర రాను పోను రూ.1400 నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99592 25645, 99660 09395, 85559 29504 నెంబర్లను సంప్రదించాలన్నారు. టికెట్‌ను ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చన్నారు.

హెచ్‌పీసీఎల్‌కి యాభై ఏళ్లు

కలువాయి, జూలై 15: హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఏర్పడి జూలై 15వతేదీ నాటికి 50 ఏళ్ల పూర్తయింది.ఈ సందర్భంగా స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సోమవారం వెరుబొట్లపల్లిలో ఎల్‌పీజీ పంచాయతీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మేకపాటి వెంకటనరసారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బోగోలులో మొహర్రం వేడుకలు

బిట్రగుంట, జూలై 15: బోగోలు మండలంలో మొహర్రం సందర్భంగా సోమవారం పీర్లచావిడిల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పీర్లచావిడి వద్ద రాత్రికి గుండం తొక్కేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుర్రంపై పీర్లను తీసుకుని ఇబ్రహీంపేట, రాజావీధిలో ఊరేగించారు.

వైసీపీ పాలనంతా దోపిడీ, అవినీతిమయం

● ఇకపై ప్రతి పని పారదర్శకంగా జరగాల్సిందే : ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, జూలై 15: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే ఎన్‌ఆర్‌ఈజీఎస్ (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం)లో లెక్కకుమించిన దోపిడీ, అవినీతి, అక్రమాలు జరిగాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గస్థాయిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంపై అధికారులు, నాయకులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి నేతలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో జరిగిన అవకతవకలను అధికారుల ఎదుట ఉంచారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో భారీగా దోపిడీ జరిగినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మండలాల వారీగా ఉపాధి పనులపై ఆరా తీశారు. వైసీపీ పాలనలో జగనన్న కాలనీల అభివృద్ధి పేరిట చేసిన అవినీతి, అక్రమాలు, దోపిడీపై విజిలెన్స్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. దీనిపై సోమిరెడ్డి సానుకూలంగా స్పందించారు. కాగా, గత ఐదేళ్లుగా సామాజిక తనిఖీలు నిర్వహించకుండానే చేసినట్లు రికార్డుల్లో నమోదు చేయడం, పనులు చేయకుండానే బిల్లులు చేసుకోవడంపై సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయంలో చేసిన పనులకు ఇంకా బిల్లులు చెల్లించకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై దోపిడీ కుదరదని, ప్రతి పని పారదర్శకంగా నాణ్యతతో రైతులు, రైతు కూలీలు, ప్రజలకు ఉపయోగపడేలా పనులు జరగాలన్నారు.

తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి సహకారం

మండలంలోని ఎర్రగుంట వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని సోమిరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఆయన అధ్యయన కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా వెంకటాచలం

భారతదేశ మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి సహకారంతో వెంకటాచలం మండలం ఎడ్యుకేషన్ హబ్‌గా వెలుగొందుతోందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు స్కూల్ కిట్లను సోమిరెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు రాజాయాదవ్, శ్రీనివాసులు యాదవ్, నాయకులు బొమ్మి సురేంద్ర, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరును కలిసిన కురుగొండ్ల


కలెక్టరుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న కురుగొండ్ల

రాపూరు(డక్కిలి), జూలై 15 : వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ సేతుమాధవ్, ఎస్పీ కృష్ణకాంత్‌లను వారివారి కార్యాలయాల్లో కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై జిల్లా కలెక్టరుతో చర్చించారు.కలెక్టర్ ఆనంద్ సానుకూలంగా స్పందించినట్లు రామకృష్ణ తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీని కలిసిన ఆయన గత ప్రభుత్వంలో టీడీపీ నేతలపై పెట్టిన తప్పుడు కేసులపై చర్చించారు.

నైపుణ్యంతో కూడిన విద్యతో ఉజ్వల భవిష్యత్


మొక్కలు నాటుతున్న అధికారులు, అధ్యాపకులు

కోవూరు, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యంతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకుంటోందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన అన్నారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాటాడుతూ నైపుణ్యంతో కూడిన విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గత ఏడాది నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 120 మంది శిక్షణ పొంది ఉపాధి సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు విజయవినీల్‌కుమార్, శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి మధుసూదనరావు, జంతుశాస్త్ర శాఖాధిపతి కే లావణ్య తదితరులు మాట్లాడారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

తోటపల్లి గూడూరు, జూలై 15: మండలంలోని పొట్లపూడి గ్రామంలో సోమవారం ఉపాధి పనికి వెళ్లిన కొమ్ము రమణయ్య (70) గుండెపోటుతో మృతిచెందాడు. ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపిన వివరాల మేరకు.. రోజులాగానే సోమవారం ఉదయం రమణయ్య ఉపాధి పనికి వెళ్లాడు. పనిచేస్తుండగా గుండెపోటు రావడంతో స్థానికులు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే చనిపోయాడని ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

కండలేరు కాలువలో వ్యర్థాలు

● ఆందోళనలో అన్నదాతలు


వ్యర్థాలతో నిండిన ఎడమ గట్టు కాలువ

పొదలకూరు, జూలై 15: పంట పొలాలకు సాగునీరందించే కండలేరు ఎడమ గట్టు కాలువ వ్యర్థాలతో నిండి డంపింగ్ కేంద్రంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొదలకూరులోని సంగం రోడ్డు సమీపంలో ఉన్న కండలేరు ఎడమ కాలువలో ప్లాస్టిక్ సీసాలు, పాలిథిన్ కవర్లు తదితర వ్యర్థాలు పేరుకుపోయాయి. సాగునీరు విడుదల చేసినప్పుడు ఈ వ్యర్థాలంతా తూముల్లో ఇరుక్కొని అడ్డంకిగా మారుతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో వ్యర్థాలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కౌలు రైతు కార్డులపై అవగాహన


కౌలురైతుకు కార్డు ఇస్తున్న వ్యవసాయాధికారి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 15: మండలంలోని ప్రతి కౌలు రైతు ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించి కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి పి సురేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రేబాల, దామరమడుగు గ్రామాలలో కౌలు రైతులతో సమావేశం ఏర్పాటుచేసి కౌలు రైతు కార్డులపై అవగాహన కల్పించారు. కౌలురైతు కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయం పొందేందుకు ఆధార్‌కార్డు, పాసుపుస్తకం, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం, మొబైల్ నంబరుతో ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారులను సంప్రదించి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా!


తోటపల్లిగూడూరు, జూలై 15 : ప్రతి కార్యకర్తకు, నాయకులకు అండగా ఉంటానని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నరుకూరు రిషి కల్యాణ మండపంలో సోమవారం నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా వైసీపీ కోసం కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తెగిన 11కేవీ విద్యుత్ తీగ

● తప్పిన ప్రమాదం


పెనుబల్లి - మినగల్లు మార్గంలో తెగిన తీగ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 15: మండలంలోని పెనుబల్లిలోని అంజనేయస్వామి విగ్రహం ఎదురుగా పెనుబల్లి నుంచి మినగల్లు వెళ్లే మార్గంలో 11కేవీ విద్యుత్ వైరు తెగిపడింది. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆమార్గంలో వెళ్తున్న మినగల్లుకు చెందిన సాయికిరణ్‌కుమార్ చూసి వెంటనే స్థానిక లైన్‌మన్ శ్రీనివాస్‌కు సమాచారమిచ్చి ఆ మార్గంలో వెళ్లేవారిని అప్రమత్తం చేయడంతో ప్రమాదం తప్పింది. లైన్‌మన్ విద్యుత్ సరఫరా నిలిపివేయించి మరమ్మతులు చేపట్టారు.


నరసారెడ్డి కాలనీలో పగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు

పగలే వెలుగుతున్న వీధి దీపాలు

● పట్టించుకోని విద్యుత్ అధికారులు

పొదలకూరు, జూలై 15 : గ్రామాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో విద్యుత్ వృథా అవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పలు కాలనీలు, గ్రామాల్లో వీధి దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతోంది. ఫలితంగా విద్యుత్ శాఖ, గ్రామ పంచాయతీలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రభుత్వం నిరంతరం విద్యుత్‌ను అందించడానికి వేల కోట్లు వెచ్చిస్తున్నా విద్యుత్‌ను ఆదా చేయాల్సిన సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా గ్రామాలలో వీధి లైట్లకు ప్రత్యేక లైన్ ఏర్పాటుచేసి ఆన్ ఆఫ్ స్విచ్‌లు అమర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోటరీ క్లబ్ అసిస్టెంటు గవర్నరుకు ఆర్ఎంపీల అభినందనలు


కొండా శేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న ఆర్ఎంపీలు

కోవూరు, జూలై 15: సింహపురి జోన్-1 డిస్ట్రిక్టు రోటరీ క్లబ్ అసిస్టెంటు గవర్నరుగా నియమితులైన కొండా శేఖర్‌రెడ్డిని జిల్లా ఆర్ఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు ఆధ్వర్యంలో పలువురు ఆర్ఎంపీలు సోమవారం అభినందించారు. ఆయన సహకారంతో పేదలకు సేవలందించేందుకు ఆర్ఎంపీలు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆయన వెంట అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా, కోశాధికారి రోజారాణి తదితరులున్నారు.

జీతాలందక జొన్నవాడ ఆలయ ఉద్యోగుల అవస్థలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 15: జొన్నవాడ ఆలయంలో ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలందక అవస్థలు పడుతున్నారు. జూన్ నెల జీతం జూలై నెల సగం రోజులు గడచినా అందకపోతే జూలై నెల జీతం ఎప్పుడిస్తారనేది కిందిస్థాయి ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. 2005కు పూర్వం 2నెలల జీతం 3వ నెలలో ఇచ్చే పరిస్థితులు ఉండేవని, మళ్ళీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. సుమారు 40లక్షల రూపాయల మేర ఆలయానికి ఆదాయం చేకూరుతున్నా జీతాల సమస్య వెంటాడుతోందని కిందిస్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్ రాష్ట్ర యోగా పోటీల్లో జిల్లాకు పతకం

నెల్లూరు(విద్య), జూలై 15 : కర్ణాటక యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులోని కోరమంగళం ఇండోర్ మైదానంలో ఆదివారం జరిగిన అంతర్ రాష్ట్ర యోగాసన పోటీల్లో నెల్లూరు కాగులపాడుకు చెందిన రఘురామయ్య తృతీయస్థానంలో నిలిచి పతకం సాధించారు. యోగా కోచ్ ప్రసన్నకుమార్, తదితరులు ఆయనను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

టిడ్కో ఇళ్లకు కట్టిన డబ్బులు ఇప్పించండి

● అధికారులను కోరిన బాధితులు


వినతులు స్వీకరిస్తున్న ఏడీసీ శర్మద

నెల్లూరు(సిటీ), జూలై 15 : ప్రభుత్వం ఇస్తామన్న టిడ్కో ఇళ్లకు తాము చెల్లించిన నగదులో తిరిగి ఇస్తామన్న డబ్బులు ఇప్పటి వరకు ఇవ్వలేదని, వాటిని త్వరగా తమకు చెల్లించాలని కొందరు బాధితులు ఎన్ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఏడీసీ శర్మదకు వినతి పత్రాలు అందజేశారు. రూ.లక్ష చెల్లించిన ఇంటికి రూ.50 వేలు, రూ.50 వేలు కట్టిన ఇంటికి అందులో సగం వెనక్కు ఇస్తామని గత ప్రభుత్వం చెప్పిందన్నారు. అప్పట్నుంచి కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కాగా వివిధ సమస్యలపై పలువురు నగరవాసులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సంపత్‌కుమార్, సీపీ దేవికుమారి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రులను కలిసిన వేమిరెడ్డి దంపతులు


సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 15 : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు సోమవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లను వేర్వేరుగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించి చేపట్టాల్సిన పనులు, పెండింగ్ అంశాలు, నిధుల మంజూరుపై చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో నెల్లూరు జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎంను కోరారు. అదేవిధంగా మంత్రులతో ఆయా శాఖలకు సంబంధించిన విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని పలు అంశాలు, వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కోవూరు నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. వారివెంట టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

వెంకయ్యను కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


వెంకయ్యనాయుడితో ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 15 : మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీధర్‌రెడ్డికి వెంకయ్యనాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద కోడూరుపాడు గ్రామస్థుల ధర్నా

నెల్లూరు(హరనాథపురం), జూలై 15 : కోడూరుపాడు పెన్నా పోరంబోకు స్థలాలు పొందిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ కోడూరుపాడు గ్రామస్థులు సోమవారం టీడీపీ సీనియర్ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో 2004 మందికి కోడూరుపాడు పెన్నా పోరంబోకు స్థలాలకు నాటి అధికార యంత్రాంగం పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఈ స్థలాలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో లబ్ధిదారులకు తగిన న్యాయం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

● ఎస్సీల భూముల్లో లేఅవుట్‌లు

కోడూరుపాడులో ప్రభుత్వం ఎస్సీలకు ఇచ్చిన ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో కోడూరు కమలాకర్‌రెడ్డి లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయించడానికి ప్రయత్నిస్తున్నాడని, ఆయనపై చర్యలు తీసుకుని తమ భూములను తమకు ఉండేలా చూడాలని కోరుతూ ఆ గ్రామ దళితులు కలెక్టర్ ఆనంద్‌కు, కలెక్టరేట్‌కు విచ్చేసిన పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణకు వినతిపత్రం అందచేశారు. తొలుత వారు కలెక్టరేట్ తిక్కన భవన్ వద్ద నిరసన తెలిపారు.

అమరావతి మహానగరం కావాలి


మంత్రి నారాయణకు స్వర్ణాంధ్రప్రదేశ్ జ్ఞాపిక అందజేస్తున్న అక్కినేని నాగార్జున ఫ్యాన్స్

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 15 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని మహానగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాజధాని రూపశిల్పి మంత్రి పొంగూరు నారాయణలకు అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు ఎన్.మధుసూదన్‌రావు, ఫ్యాన్స్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమవారం నారాయణ క్యాంప్ కార్యాలయంలో మంత్రి నారాయణను ఘనంగా సత్కరించి, స్వర్ణాంధ్రప్రదేశ్ మెమొంటోను అందజేశారు. నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దాలని కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో శ్రీకంఠం రమణయ్య, శివారెడ్డి, ప్రవీణ్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

కడపకు బారాషహీద్ దర్గా ఫెస్టివల్ కమిటీ


కడపకు బయలుదేరిన దర్గా కమిటీ నాయకులు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 15 : బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు సంబంధించి గంధమహోత్సవానికి హాజరుకావాలని కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీని ఆహ్వానించేందుకు దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషాతో పాటు సభ్యులుసోమవారం నెల్లూరు దర్గా నుంచి బయలుదేరారు. ఆయనకు ఆహ్వాన పత్రాన్ని అందజేసి తిరిగి నెల్లూరుకు రానున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది బారాషహీద్ దర్గాకు సంబంధించి పెద్ద ఎత్తున మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. కడపకు బయలుదేరిన వారిలో సయ్యద్ సమీ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్, షంషుద్దీన్, షేక్.మునీర్, రసూల్, పఠాన్ జాఫర్‌ఖాన్, జిలానీ, అస్లాం, పలువురు మైనార్టీ నాయకులు ఉన్నారు.

స్థానిక పీఠాధిపతులకు అవకాశం కల్పించాలి


మాట్లాడుతున్న మఠాధిపతులు

మొహర్రం నెలలో జరిగే బారా షహీద్‌ల గంధమహోత్సవం స్థానిక పీఠాధిపతుల ద్వారా నిర్వహించాలని నెల్లూరు సాదత్ ముషాయిక్ వెల్ఫేర్ కమిటీ ముస్లిం మఠాధిపతులు సంఘం అధికార్లకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం చిన్నబజారు ఖాజాపీర్ మఖాన్‌లో జరిగిన సమావేశంలో ఆ కమిటీ అధ్యక్షుడు కేఎస్ఎస్ బాబా చంద మ్యాజ్ మాట్లాడుతూ చాలా కాలం నుంచి బారాషహీద్‌ల గంధ మహోత్సవంలో స్థానిక పీఠాధిపతులను ఆహ్వానించాలని తాము చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆ గంధమహోత్సవం పవిత్రత కోసం స్థానిక పీఠాధిపతులకు అప్పగించాలని కోరారు. ఈ సమావేశంలో సయ్యద్ ఫయాజ్ రజ్వీ, సయ్యద్ జాఫ్ఞా సాహెబ్, సర్తాజ్, రఫత్ హుసేనీ, తదితరులు పాల్గొన్నారు.

19న రాజరాజేశ్వరికి శాకాంబరి అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 15 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి ఆషాఢ శుద్ధ తదియ సందర్భంగా ఈనెల 19వ తేదీన శాకాంబరి అలంకారం జరుగుతుందని ఆలయ చైర్మన్ రత్నంజయరామ్, సహాయ కమిషనర్ బి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి శాకాంబరి అలంకారానికి ఉభయకర్తలుగా రాజరాజేశ్వరి రైస్ ఇండస్ట్రీస్ అధినేతలు కొలపర్తి రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మి దంపతులు వ్యవహరిస్తారని తెలిపారు. భక్తులందరూ రాజరాజేశ్వరి అమ్మవారిని శాకాంబరి అలంకారంలో దర్శించుకోవాలని కోరారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి : జనసేన


బాధితుల పరిస్థితి తెలుసుకుంటున్న కిశోర్

నెల్లూరు(వైద్యం), జూలై 15 : నాయుడుపేట ప్రభుత్వ వసతిగృహంలో కల్తీ ఆహారం కారణంగా పిల్లలు డయేరియాకు గురికావడానికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన నేత గునుకుల కిశోర్ డిమాండ్ చేశారు. నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం ఆయన పరామర్శించారు. వైద్యులను కలిసి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో 5 మంది చికిత్స పొందుతున్నారన్నారు. వారి ప్రస్తుత పరిస్థితి మెరుగు పడిందన్నారు. నాయుడుపేట వసతిగృహంలో 87 మంది విద్యార్థులు డయేరియాకు గురికావటం ఆందోళన కరమన్నారు. ఆహార కల్తీ జరుగుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నిస్తూ అలాంటి వారిని సస్పెండ్ చేయాలన్నారు.

'స్వర్ణదీపం'లో అన్నదానం


అన్నదానం చేస్తున్న పలమాల శ్రీహరిరావు


నెల్లూరు(హరనాథపురం), జూలై 15 : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు సోమవారం తల్పగిరి కాలనీలోని స్వర్ణదీపం ట్రస్ట్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరరావు బీసీల అభ్యున్నతికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నడిపి వారిని చైతన్య పరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చిలకపాటి మాల్యాద్రి, మన్నెం రాముగౌడ్, కిరణ్‌కుమార్, రామకృష్ణ, లక్ష్మీప్రసాద్‌గౌడ్, శైలజ, హారతి, అంకయ్య, వసంత, బీసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్రాలవారి ట్రస్ట్ వార్షికోత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 15 : నగరంలోని చక్రాలవారి ట్రస్ట్ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. అలాగే గీతామయి బాలల ఆశ్రమం విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు అందజేశారు. సమాజసేవకు చక్రాల వారి ట్రస్ట్ ముందడుగులో ఉంటుందని మేనేజర్ సమయానంద తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిశంకర ధ్యాన మందిరం అధ్యక్షుడు పారాగురు శ్రీధర్‌శర్మ, అన్నవరం సత్యనారాయణ, ఉదయకుమార్ శర్మ, చక్రాల లక్ష్మీరమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ

నెల్లూరు(విద్య), జూలై 15 : స్వచ్ఛత పక్వాడలో భాగంగా భారత్‌గ్యాస్, కేంద్ర సమాచార ప్రచార మంత్రిత్వశాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సంయక్తంగా 'పరసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నగరంలోని ఆర్ఎస్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై పోటీల్లో వివరించారు. అనంతరం పోటీల్లో గెలు పొందిన నలుగురు విద్యార్థులకు నగదు బహుమతులు, 15 మంది విద్యార్థులకు కన్సలేషన్ బహు మతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ క్షేత్ర ప్రచార సహాయకులు పీ.హరికృష్ణ, భారత్ గ్యాస్ ఏజెన్సీ యజమాని ఎం.సునీత లక్ష్మి, మురిగిపూడి ట్రస్ట్ అధ్యక్షుడు సతీష్‌కుమార్, పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌బాబు, వైవీఎం ప్రధానో పాధ్యాయుడు తిరుమల రాజు, సైన్స్ ఉపాధ్యాయుడు సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



కృతజ్ఞతా యాత్ర



రాజధాని అమరావతిని నిలబెట్టే నాయకుడిని రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్నారని అమరావతి రైతులు సంతోషం వ్యక్తం చేశారు.అమరావతికి చెందిన పలువురు రైతులు 'కృతజ్ఞత పాదయాత్ర' పేరుతో తిరుమలకు చేరుకుని సోమవారం సాయంత్రం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ సుధాకర్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. రాజధానిని కాపాడుకుందాం-రాష్ట్రాన్ని పరిరక్షించుకుందామనే లక్ష్యంతో 1,631 రోజుల పాటు ఉద్యమం చేశామన్నారు. అయితే గత పాలకులు తమపై దౌర్జన్యాలు చేశారన్నారు. ఈ క్రమంలో న్యాయస్థానం టూ దేవస్థానం పేరుతో చేసిన పాదయాత్రను కూడా వైసీపీ నాయకులు అడుగడుగునా అడ్డుకున్నారని వాపోయారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రజల సహకారంతో రాజధానికి, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామన్నారు.అమరావతిని రక్షించడంతో పాటు రాష్ట్ర ప్రజలను కష్టాల నుంచి బయటకు తీసుకురావాలని స్వామిని గతంలో కోరుకున్నామన్నారు. శ్రీవారి, ప్రజల ఆశీస్సులతో రావణకాష్టంగా ఉన్న రాష్ట్రం ఎన్నికల తరువాత రామరాజ్యంగా మారిందన్నారు. ఈ క్రమంలో కృతజ్ఞత పాదయాత్ర పేరుతో 21 రోజుల పాదయాత్ర చేసి స్వామిని దర్శించుకున్నామన్నారు. పాలకులకు పూర్తి శక్తి సామర్థ్యాలు ఇచ్చి, అమరావతితో పాటు ఏపీని అభివృద్ధి చేసేలా ఆశీర్వదించామని కోరుకున్నామన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీ సర్వర్లు డౌన్



చంద్రగిరి సమీపంలోని శ్రీవారిమెట్టు నడకమార్గంలో సర్వర్లు మొరాయించడంతో శ్రీవారి భక్తులు ఇబ్బంది పడ్డారు.కాలినడక భక్తుల సౌకర్యార్థం శ్రీవారిమెట్టు ప్రారంభంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు దివ్యదర్శన టోకెన్లు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే రెండురోజులుగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం సర్వర్లు నిలిచిపోవడంతో టోకెన్ల జారీలో అంతరాయం ఏర్పడింది. దీంతో కాలినడక భక్తులు కౌంటర్ల వద్ద క్యూలైన్లలో తడుస్తూనే బారులు తీరాల్సి వచ్చింది. 10 గంటల తరువాత సర్వర్లు పనిచేయడంతో భక్తులకు టైం స్లాట్ టోకన్లు జారీ చేశారు.

- చంద్రగిరి

నిమ్మకు కాసుల వర్షం



గూడూరు నిమ్మ మార్కెట్‌లో సోమవారం కిలో నిమ్మకాయలు రూ.90కి డీబీఆర్ కంపెనీ కొనుగోలు చేసింది. అడపాదడపావర్షాలు కురిసి నేలంతా బురదమయం కావడంతో నిమ్మకాయలు కోసేందుకు వీల్లేకుండా పోయింది.దీంతో మార్కెట్‌కు కాయలు తక్కువగా రావడంతో ధర ఊపందుకుంది. 50 కిలోల టిక్కీ బస్తా ధర రూ.4,500, 80 కిలోల లూజు బస్తా రూ.7,200 పలకడంతో నిమ్మరైతులు సంతోషభరితులయ్యారు. పొడి, సన్న కాయలు సైతం కిలో రూ.40 నుంచి రూ.50 పలకడంతో రైతుల్లో ఆనందం కనిపించింది.

-గూడూరు అర్బన్

విషాహారంతో విలవిల



నాయుడుపేట ఆస్పత్రిలో విద్యార్థులకు చికిత్స

అస్వస్థతపాలైన 128మంది గురుకుల పాఠశాల విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి బాల వీరాంజనేయస్వామి

నాయుడుపేట/నాయుడుపేట టౌన్, జూలై 15 : వసతి గృహ నిర్వాహకుల కక్కుర్తి....అధికారుల పర్యవేక్షణలోపం ఆ పేద విద్యార్థుల పాలిట శాపమైంది. చెడిపోయిన ఆహారం తినడంతో వందమందికి పైగా విద్యార్థులు ఆస్పత్రులపాలవ్వాల్సివచ్చింది. నాయుడుపేట లోని అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో మొత్తం 881 విద్యార్థులుంటుండగా, శనివారం సాయంత్రం 520మంది మాత్రమే వున్నారు. ఆదివారం ఉదయం వరకు ఉల్లాసంగా ఉన్న విద్యార్థులు టిఫిన్ తిన్నాక అస్వస్థత పాలయ్యారు.ముందురోజైన శనివారం తయారుచేసిన పూరీలను అల్పాహారంగా అందించడంతో కొంతమంది విద్యార్థులకు విరోచనాలయ్యాయి. ఇది గమనించిన స్థానిక కాంపౌండర్ వారికి మందులందించారు.ఆదివారం కావడంతో మధ్యాహ్నం చాలామంది తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వచ్చారు. వారు తెచ్చిన భోజనాన్ని విద్యార్థులు తినడంతో అప్పటికే హాస్టల్‌లో వండిపెట్టి ఉన్న చికెన్ భోజనం మిగిలిపోయింది.దాన్నే వేడిచేసి రాత్రి విద్యార్థులకు పెట్టారు.భోంచేసిన వెంటనే విద్యార్థులు ఒకరి తరువాత ఒకరు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడ్డారు. దీంతో కంగారుపడ్డ వసతిగృహ అధికారులు అర్ధరాత్రి సమయంలో 66మందిని నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.39మందిని గూడూరు, ప్రభుత్వ ఆస్పత్రికి, 16మందిని సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందజేశారు.మరో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తరలించారు.

ప్రిన్సిపాల్ , వార్డెన్ సస్పెన్షన్

నాయుడుపేట గురుకుల పాఠశాలలో వసతిగృహాల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది.మరుగుదొడ్లు, వంటగది దుర్వాసనకు కేంద్రాలైపోయాయి.విద్యార్థులు అస్వస్థత పాలయ్యారని తెలిసి సోమవారం ఉదయం గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ విస్తుపోయారు.నిర్వహణలోపంమీద అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని తెలిసి ప్రిన్సిపాల్ దాదాపీర్, వార్డెన్ విజయభాస్కర్, ఆరోగ్య సహాయకులు ఇద్దరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారు.జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేయిస్తామని తెలిపారు.సీఎం చంద్రబాబు ఆదేశాలతో సాంఘిక సంక్షేమ శాఖామంత్రి బాలాంజనేయస్వామి అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ నిర్వహణపై మంత్రికి ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం కూడా ఇలాగే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కఠిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చిన మంత్రి హాస్టల్‌ను పరిశీలించారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలి : వైద్య మంత్రి

తిరుపతి(వైద్యం), జూలై 15: అస్వస్థతకు గురైన గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలందించాలని మంత్రి సత్యకుమార్ వైద్యులను ఆదేశించారు.విద్యార్థుల పరిస్థితిని వైద్యాధికారులతో మాట్లాడి తెలుసుకున్న ఆయన ఎప్పటికప్పుడు పరిస్థితిని తనకు తెలియజేయాలన్నారు.బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.కలెక్టర్,డీఎంహెచ్‌వో లతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని మంత్రికి తెలియజేశారు.

బాధ్యులపై కఠిన చర్యలు
- మంత్రి డోలా


గూడూరు, జూలై 15 : నాయుడుపేట గురుకుల పాఠశాలలో ఘటనకు కారకులపై కఠిన చర్యలు చేపట్టి ఈ తరహా చర్యలు పునరావృతం కాకుండా చూస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. సోమవారం గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సంఘటనలో సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యం కన్పిస్తోందన్నారు. కలుషిత ఆహారం కారణంగానే విద్యార్థులు అతిసార బారిన పడినట్లు భావిస్తున్నామన్నారు.ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందన్నారు.ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్,వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రీహరి,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు సుధీర్, చంద్రారెడ్డి , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గురుకులంలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు


ఇవి మరుగుదొడ్లా?

881మంది విద్యార్థులున్న గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు 24 మాత్రమే. వాటికి కూడా తలుపుల్లేవు... తలుపులున్న వాటికి గెడియల్లేవు.అపరిశుభ్ర వాతావరణం రాజ్యమేలుతున్నా పరిశుభ్రంగా ఉంచాల్సిన కాంట్రాక్టర్ పట్టించుకున్న దాఖలాల్లేవు. నాడు-నేడు అంటూ గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు గుమ్మరించి పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దామంటూ ఊరూవాడా ప్రచారం చేసుకుంది. మరి ఈ గురుకుల పాఠశాల అప్పట్లో వారికి కనబడలేదేమో.మూడేళ్ల క్రితం ఇలాగే విద్యార్థులు అస్వస్థతకు గురైనా పట్టించుకోకపోవడంతో దుస్థితి కొనసాగింది.ఈసారి ఘటన జరిగిందని తెలిసిన వెంటనే మంత్రి , స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ వెంకటేశ్వర్ , అధికారులు గురుకులాన్ని పరిశీలించారు.విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు.విద్యార్థులు కోలుకునేంతవరకు మంగళ, బుధ, గురువారాలు సెలవు ప్రకటించారు. గృహాలకు వెళ్లలేని విద్యార్థులకు టీటీడీ కల్యాణ మండపంలో వసతి, భోజనాలను ఏర్పాటు చేస్తామన్నారు.యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని హామీ ఇవ్వడం విద్యార్థుల తల్లిదండ్రుల్లో సంతోషాన్ని నింపింది.



గురుకులంలో సీలింగ్ ఫ్యాన్ పరిస్థితి

పొగమంచు దోబూచులాట



పొగమంచులో గాలిగోపురం శంఖుచక్రనామాలు



జీఎన్సీ వద్ద..



ఘాట్‌రోడ్డులో..

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం కూడా చిరుజల్లులు కురిశాయి.వేకువజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో శ్రీవారి దర్శనానికి వెళ్లేవారితో పాటు కాలినడకన వచ్చే భక్తులు కూడా తడుస్తూనే రాకపోకలు సాగించారు.తిరుమలలో వాతావరణం మారిపోయింది. విపరీతమైన చలి భక్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.మరోవైపు తిరుమల క్షేత్రాన్ని, శేషాచల కొండలను పొగమంచు కప్పేసిన దృశ్యాలు భక్తులకు కనువిందు చేశాయి.చిరుజల్లులు కురుస్తున్న నేపథ్యంలో టీటీడీ ఘాట్‌రోడ్లపై నిఘా పెట్టింది.తరచూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజినీరింగ్ అధికారుల బృందాలు పరిశీలించాయి.ఎక్కడైనా బండరాళ్లు, కొండచరియలు, చెట్లు విరిగిపడితే వెంటనే స్పందించేలా సిద్ధమయ్యాయి.

తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా
ఎస్పీ సుబ్బరాయుడు



తిరుపతి(నేరవిభాగం), జులై 15: దేశ విదేశాల్లో ప్రఖ్యాతిగాంచిన తిరుపతిలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు చెప్పారు. తిరుపతిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో మంచిగా పనిచేస్తే దేవుడికి సేవ చేసినట్లు భావిస్తామన్నారు.రోజూ వేలాదిమంది భక్తులు వచ్చిపోయే తిరుపతిలో శాంతి భద్రతలు పరిరక్షించడమే తన ప్రధాన అజెండా అన్న ఆయన ఈ విషయంలో అందరి సహకారాన్నీ కోరుతున్నట్లు చెప్పారు.అందరూ చట్టాలకు లోబడి పనిచేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విజుబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు.అంతకుముందు ఏఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, డీఎస్పీలు రవిమనోహరాచారి, రమణకుమార్, భవ్యశ్రీ, సీఐలు, ఎస్ఐలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

యానిమల్ హజ్బెండరీ డిప్లొమాకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, జూలై 15 : ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో యానిమల్ హజ్బెండరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ వి.చెంగల్వరాయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదవతరగతి విద్యార్హతతో ఆంగ్లమాధ్యమంలో నిర్వహించే ఈ కోర్సుకు ఈనెల 8నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, ఇదే నెల 22వతేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. విద్యార్థుల పదోతరగతి మెరిట్, రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, ఆసక్తి, అర్హత ఉన్న జనరల్, బీసీ అభ్యర్థులు రూ.880, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.440 దరఖాస్తు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల వయోపరిమితి 2024ఆగస్టు31 నాటికి 15-22సంవత్సరాల మధ్య ఉండాలని, ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్వీవీయూ. ఈడీయూ. ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.వర్సిటీపరిధిలోని ప్రభుత్వ కళాశాలల్లో 330సీట్లు, ప్రైవేట్ కాలేజీల్లో 660సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

రీచ్‌ల నుంచే ఇసుకను అందజేయాలి



సబ్‌కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ధర్నా

గూడూరు, జూలై 15: రీచ్‌ల నుంచే ఇసుకను అందజేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ. 4,500 ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తున్నా ట్రాక్టర్ ఇసుక రూ.5,500 అడుగుతున్నారన్నారు. ఇసుక యార్డుల నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే రవాణా ఖర్చులు అధికమవుతున్నాయన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. దగ్గరలో ఉన్న కోట, వాకాడు, గూడలి, చిట్టమూరు రీచ్‌ల ద్వారా ఇసుక తోలుకోవడానికి అనుమతి కల్పిస్తే ట్రాక్టర్ ఇసుక రూ.3వేలుకే అందుబాటులోకి వస్తుందన్నారు. అధికారులు రీచ్‌లను పరిశీలించి వాటి ద్వారా తరలించుకునే విధంగా అనుమతులు మంజూరు చేస్తే భవన నిర్మాణ కార్మికుల జీవనోపాధి మెరుగవుతుందన్నారు. ఈ ధర్నాలో శివకుమార్, శంకరయ్య, బీవీరమణయ్య, ప్రసాద్, సురేష్, రఫీ, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

గూడూరు అర్బన్, జూలై 15: రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు టి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయంలో రేషన్ బియ్యం యథేచ్ఛగా చెన్నైకు అక్రమంగా తరలించేవారన్నారు. ప్రస్తుతం రవాణ జోరుగా సాగుతోందన్నారు. అధికారులు స్పందించి అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున, సాయికిరణ్, వేణు, సుమన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు పారదర్శకంగా నిర్వహించండి


మాట్లాడుతూ ఎస్సార్పీ రవి

చిల్లకూరు, జూలై 15: గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై డీఆర్పీలు పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలని ఎస్సార్పీ రవి, ఎంపీడీవో భానుమూర్తిరావు ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీలపై డీఆర్పీలు, క్షేత్ర సహాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డీఆర్పీలు ఈనెల 16న మంగళవారం నుంచి గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కూలీలకు సక్రమంగా కూలి అందించారా అనే విషయాన్ని కూడా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయండి

వెంకటగిరిటౌన్, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. సోమవారం 8వ సచివాలయంలో స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం వచ్చే ప్రజలకు భరోసా ఇవ్వాలన్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

చెరువులు, రోడ్ల అభివృద్ధికి చర్యలు


అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, జూలై 15: నియోజకవర్గ పరిధిలో దెబ్బతిన్న చెరువులు, ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ నివాసంలో రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా దెబ్బతిన్న చెరువుల ఆనకట్టలు అభివృద్ధికి, దెబ్బతిన్న రోడ్లను అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి అందిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

సర్వేయర్‌పై చర్యలు తీసుకోండి


ధర్నాలో రైతు సంఘ నాయకులు

గూడూరు, జూలై 15: రెవెన్యూ రికార్డులు తారుమారు చేస్తున్న మండల సర్వేయర్‌పై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని నియోజక వర్గ రైతు సంఘం కన్వీనర్ సీవీఆర్ కుమార్ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సర్వేయర్ రికార్డులను పరిశీలించకుండా నిర్లక్ష్యంగా వ్యవరించడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా సబ్ డివిజన్ చేస్తుండడంతో అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి విచారణ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో శశికుమార్, కాలేషా, చంద్రయ్య, నారాయణ, విజయ్, కోటయ్య, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపుకార్డులు


అధికారులకు సూచనలిస్తున్న ఏడీఏ అనిత

సూళ్లూరుపేట, జూలై 15: సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారి సత్రం మండలాల్లోని భూములను కౌలుకు చేసే రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామని సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత అన్నారు. సోమవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణతో కలిసి కౌలు రైతుల గుర్తింపు కార్డులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి గ్రామంలో ఆధార్‌కార్డు ఆధారంగా కౌలురైతులను గుర్తించి గుర్తింపు కార్డులను అందజేస్తామన్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని అర్హులైన కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం వల్ల వారికి పంట బీమాతో పాటు పంట పరిహారం, ప్రభుత్వ పథకాలన్ని వర్తిస్తాయన్నారు. డీటీ చైతన్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు
పీఎం, సీఎం చిత్రపటాల అందజేత

కోట, జూలై 15 : పట్టణంలోని తహసీల్దారు, మండల పరిషత్, పోలీస్ స్టేషన్, పంచాయతీ కార్యాలయాలకు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలను టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి టి.కోటేశ్వరరావు, జనసేన నాయకుడు అల్లంబాబు తహసీల్దారు నాగరాజరావుకు అందజేశారు.

ఐదేళ్లు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ
- అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఆస్పత్రిలో పరామర్శ


ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 15: ఐదేళ్ల వైసీపీ పాలనలో గురుకులాలను, వసతి గృహాలను పట్టించుకోకపోవడం వల్లే నేడు ఇలాంటి పరిస్థితులకు దారి తీస్తున్నాయని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. కనీసం గురుకులంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు కూడా జీతాలు చెల్లించ లేని దౌర్భాగ్యస్థితిలో పాలన సాగడం సిగ్గుచేటన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ గురుకులంలో నిల్వ ఆహారం తిని అస్వస్థకు గురై సూళ్లూరుపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆమె మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యంతో కలిసి పరామర్శించారు. అక్కడ వైద్యులను విద్యార్థుల ఆరోగ్య పరిస్థితితులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గురుకులాలను పట్టించుకోలేదని అక్కడ పరిసరాలు, మరుగుదొడ్లు, వంట చేసే ప్రదేశం చూస్తేనే అర్థమవుతుందన్నారు. ఇక గురుకులం భవనాలు, పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి సహా విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది లేరన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఇక పై అలాంటివి జరగకుండా గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం పెట్టే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. గురుకులంలో ప్రిన్సిపాల్, వార్డెన్ పర్యవేక్షణ లేకపోవడంతో నిల్వ ఆహారం పెట్టిన వల్ల విద్యార్థులకు అస్వస్థతకు గురయ్యారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు కె.పెంచలయ్య, బుజ్జిబాబు, డి.రవి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా విద్యాలయాలు




మద్యం బాటిళ్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణం - సీసా పెంకులతో నిండిన క్రాస్ రోడ్డు వద్ద ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం

వెంకటగిరి, జూలై 15: వెంకటగిరిలో సరస్వతీ మాత కొలువు దీరిన ప్రభుత్వ విద్యాలయ, కళాశాల ప్రాంగణాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. రాత్రీపగలూ తేడా లేకుండా ఆకతాయిలు విద్యాలయాలు, కళాశాలల క్రీడా ప్రాంగణాల్లో మద్యం తాగుతుండడంతో బెల్టు షాపులను తలపిస్తున్నాయి. అదేవిదంగా క్రీడా ప్రాంగణాల్లో మద్యం బాటిళ్లను పగల గొట్టడంతో క్రీడాకారులు, వాకింగ్ చేసే వారికి ఇబ్బంది తప్పడం లేదు. ఈ విషయంపై ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని తెలుస్తోంది. నియంత్రించాల్సిన పోలీసులూ పట్టించుకోవ డంలే లేదనే విమర్శలున్నాయి. సంబంధిత అధికారులు స్పంచించాల్సి ఉంది.

పీర్లచావిడిలో కురుగొండ్ల ప్రార్థనలు


పీర్లు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో కురుగొండ్ల తదితరులు

వెంకటగిరి, జూలై 15 : మోహర్రంను పురష్కరించుకుని పట్టణంలోని పీర్లాదిపేటలో ముస్లిం లు సోమవారం నిర్వహించిన పీర్ల చావిడి కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ హయాంలోనే మసీదులు, ప్రార్థనా మందిరాలను అభివృద్ధికి నోచుకున్నాయన్నారు. తమ ప్రభుత్వం ముస్లింలకు అండగా నిలుస్తుందన్నారు. గతంలో టీడీపీ హయాంలో రంజాన్‌కి తోఫా కిట్లు అందచేశామని చెప్పారు. వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పి.రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పి.విశ్వనాథనాయుడు, మంకు ఆనంద్, కాపా శ్రీనివాసులు నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్ చౌదరి, నాని, చంటి ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి సొబగులు




సూళ్లూరుపేట, జూలై 15: ఒకప్పుడు ఆ కార్యాలయ ఆవరణమంతా పగటి పూట వాహనాల పార్కింగ్, రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు నిలయంగా మారేది. ఉన్న ప్రహరీ కూలిపోయి మొండి గోడలతో దర్శనమిచ్చేది చుట్టూ పక్కల పిచ్చిమొక్కలు, విష సర్పాల బెడద కూడా ఎక్కువే. ఎన్నికల బదిలీల్లో సూళ్లూరుపేటకు తహసీల్దార్‌గా వచ్చిన కె.వి.గోపాలకృష్ణ ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు కార్యాలయ రూపురేఖలు మార్చారు. ఎన్నికల పనుల్లో సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అప్పటి కలెక్టర్ ప్రవీణ్ కుమార్ కార్యాలయంలో ఉండగా ఎవరుపడితే వారు రావడం, ఆవరణలో ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపి ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సారి తనిఖీలకు వచ్చేలోగా కార్యాలయ రూపురేఖలు మార్చాలని ఆదేశించారు. దీంతో వెంటనే ప్రహరీ నిర్మించారు. ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి, విద్యుత్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. దీనిపై తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ... ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు కార్యాలయం సహా పరిసరాలను అభివృద్ధి చేసినట్టు తెలిపారు.

స్థానికులకే ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వాలి


మండల పరిషత్ కార్యాలయం ఎదుట జరుగుమల్లివాసుల ధర్నా

కోట, జూలై 15: గ్రామంలో ఉండే స్థానికులకే ఉపాధి హామీ పథక ఫీల్డ్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పించాలని జరుగుమల్లివాసులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్ర మాలు చేపట్టారు. జరుగుమల్లి పంచాయతీకి ప్రస్తుతం కొనసాగుతున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించే ప్రయత్నంలో ఉన్నారని, ఆయన స్థానంలో కొత్తగా వచ్చే వ్యక్తి స్థానికేతరుడన్నారు. స్థానికులకే ఆ పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని ఏపీవో పూర్ణిమకు అందజేశారు. కోట పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ పద్మమ్మను తొలగించకుండా కొనసాగిం చాలంటూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

అవధాన నైపుణ్యాలను పెంచుకోవాలి



తిరుపతి రూరల్, జూలై 15: విద్యార్థులు చదువుతోపాటు అవధాన నైపుణ్యాలు పెంచుకోవాలని బెంగళూరుకు చెందిన విద్యానికేతన్ డైరెక్టర్ విజయకృష్ణ రాజగోపాల్ పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో సోమవారం మూడవ అవధాన సంఘమ ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అవధాన ప్రక్రియపై సరైన అవగాహన కల్పించేందుకు అవధాన సంఘమ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులందరూ అవధాన కౌశలాలను పెంచుకోవాలని తెలిపారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మానవవిజ్ఞాన కేంద్రం డైరెక్టర్ సంపదానంద మిశ్ర, డాక్టర్ ధూళిపాల మహదేవమణి, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అకడమిక్ డీన్ రజనీకాంత శుక్లా, కోఆర్డినేటర్ సచ్చిదానందమూర్తి, డాక్టర్ నీలాబ్‌శర్మ, డాక్టర్ వైష్ణవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాత జీఎన్‌టీ రోడ్డులో
ఇరుక్కుపోయిన భారీ వాహనం



నాయుడుపేట టౌన్, జూలై 15: నాయుడుపేట - శ్రీకాళహస్తి పాత జీఎన్‌టీ రోడ్డు పాత ట్రెజరీ సమీపాన సోమవారం భారీ లోడ్‌తో వస్తున్న లారీ ఆగిపోయింది. మేనకూరు సెజ్‌కు భారీ లోడ్‌తో వెళ్తుండగా లారీ రోడ్డుపై ఉన్నట్టుండి ఆగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొద్దిపాటి చినుకులకే గుంతల్లో నీరుచేరి బురదమయంగా ఉండటంతో ద్విచక్రవాహన దారులు అవస్థలు పడాల్సి వచ్చింది.

మా భూములకు దారి చూపండి

- ప్రజా ఫిర్యాదుల వేదికలో రైతుల మొర


వినతిపత్రం అందిస్తున్న రైతులు

పెళ్లకూరు, జూలై 15 : మండలంలోని చిల్లకూరు నుంచి పెనల గుర్రప్పతోట వరకు దారికి ఇరువైపుల ఉన్న పొలాలకు వెళ్లేందుకు దారి చూపాలంటూ పలువురు రైతులు సోమవారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి నిర్మాణంలో పొలాలకు ఇవతల నుంచి అవతలకు దాటే మార్గం లేకుండా పోయిందన్నారు. దీంతో పంటను గట్టుకు చేర్చుకోలేక అవస్థలు పడుతున్నామని తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా అయినా పంటపొలాలకు వెళ్లేందుకు దారి చూపి ఆదుకోవాలని కోరారు. నెలబల్లి పంచాయతీ టెంకాయతోపులో మురుగు వ్యవస్థపై గ్రామస్తులు అర్జీ అందజేశారు. ఎంపీడీవో సురేష్‌బాబు, ఆర్ఐ సంతోషీబాయి, ఏవో ప్రవీణ తదితరులు ఉన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడి


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

కోట, జూలై 15: విత్తనం ఆరోగ్యంగా ఉంటే సాగులో పెట్టిన పంట కూడా మంచి దిగుబడులు ఇస్తుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు తెలిపారు. మండల పరిధిలోని తిన్నెలపూడిలో సోమవారం ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం, విత్తనశుద్ధిపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. విత్తనశుద్ధితో పంటలకు చీడపీడలు సోకవన్నారు. బీజామృతాలను మహిళా రైతుల సమక్షంలో తయారుచేసి వాడే విధానంపై అవగాహన కల్పించారు. మోడల్ మేకర్ శ్రీనివాసులు, పద్మ, శివకుమారి, భాగ్యమ్మ, కృష్ణసకి, సుజాత, శ్రావణి తదితరులు ఉన్నారు.

విద్యానగర్‌లో జ్యోతిడే


బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు

కోట, జూలై 15 : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల్లో సోమవారం జ్యోతిడే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఉద్యోగులు బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విద్యానగర్ ప్రాంతంలో విద్యాసంస్థలకు బీజం వేసిన రోజును జ్యోతిడేగా ప్రకటించడంతో ఆయా ఉద్యోగులు ఈ కార్యక్రమం నిర్వహించారు. పూరిగుడిసెలో రాత్రి పాఠశాలతో ప్రారంభమైన ఈ విద్యాసంస్థలు అంచెలంచెలుగా ఎదిగి దేశ విదేశాలల్లో ఖ్యాతి గడించాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.98 కోట్లు

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.98 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 84,797 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 29,497 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి సేవలో.. భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణా ఎల్లా, ఎండీ సుచిత్ర ఎల్లా దంపతులు, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే ఏ.సాంబశివరావు, తిరుపతి ఎంపీ గురుమూర్తి ఉన్నారు.

బాధిత విద్యార్థులకు టీడీపీ నాయకుడి చేయూత


ఆస్పత్రిలో నెలవల రాజేష్

నాయుడుపేట, జూలై 15: నాయుడుపేట ఎల్ఏ సాగరంలోని బాలుర గురుకులంలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన సమాచారాన్ని అందుకున్న వెంటనే టీడీపీ నాయకుడు నెలవల రాజేష్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 అంబులెన్స్‌లో తరలించేందుకు ఎక్కువమంది విద్యార్థులు ఉండటంతో తన వాహనం సహా ఇతర వాహనాల్లో బాధిత విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. మందుల కొరత ఉండటంతో తక్షణమే రూ.20వేలు వాటిని తెప్పించి అందజేశారు. అలాగే విద్యార్థులకు సోమవారం ఆహారాన్ని అందించారు.

విద్యార్థులకు పరామర్శ

గూడూరు అర్బన్: అతిసారతో బాధపడుతూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాయుడుపేట గురుకుల పాఠశాల విద్యార్థులను సోమవారం పలు సంఘాల నాయకులు పరామర్శించచారు. చికిత్స పొందుతున్న వారికి మెరుగై వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. ఏబీవీపీ, పీడీఎస్‌యూ, బీజేవైఎం, సీపీఎం, సీపీఐ నాయకులు పరామర్శించారు.

నెల్లూరు కలెక్టరును కలిసిన కురుగొండ్ల



వెంకటగిరి, జూలై 15 : వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్, అదనపు కలెక్టర్ మాధవ్, ఎస్పీ కృష్ణకాంత్‌ను వారి కార్యాలయాలకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్ప గుచ్చం అందచేసి శుభాకంక్షలలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టరుతో చర్చించారు. ముఖ్యంగా నియోజకవర్గంలో కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు నెల్లూరు జిల్లా పరిధిలోనూ, మిగిలిన వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాలు తిరుపతి జిల్లా పరిధిలో ఉన్నాయన్నారు. ఇందులో రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో తాగు, సాగునీటి సమస్యల తోపాటు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇంకా ఈ ప్రాంతంలో రైతుల భూ సమస్యలు పరిష్కారం చూపాలని కోరారు. ఇక జిల్లా ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసిన రామకృష్ణ గత ప్రభుత్వంలో టీడీపీ నేతలపై పెట్టిన తప్పుడు కేసులపై చర్చించారు.

అభివృద్ధే అజెండాగా పని చేద్దాం: విజయశ్రీ


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, జూలై 15 : సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే అజెండాగా పనిచేద్దామని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. సోమవారం సాయంత్రం మండల కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఎంపీపీ డి.సుజాతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శాఖల వారీగా అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. మండలంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీటి కొరత లేకుండ చూస్తామని తెలిపారు. అలాగే ఆగిపోయిన తెలుగుగంగ కాలువలను పూర్తి చేయిస్తానన్నారు. ఉప ఎంపీపీ డి.గోపాల్‌రెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహాయాదవ్, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీ


గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం

దొరవారిసత్రం, జూలై 15: దొరవారిసత్రంలో సోమవారం ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా టీడీపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది. ఆ పార్టీ మండల బీసీ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దొరవారిసత్రంలోని కెనరా బ్యాంక్ సెంటర్ నుంచి మండల కార్యాలయం వరకు జరిగిన విజయోత్సవ ర్యాలీలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. మండల బీసీ నాయకులు భారీ గజమాలను క్రేన్ సాయంతో ఎమ్మెల్యేకు వేసి సత్కరించారు. అలాగే తీన్‌మార్ బ్యాండ్‌తో ఊరేగింపులా ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కూడా పాల్గొన్నారు. వీరికి మండల బీసీ నాయకులు పామంజి శ్రీనివాసులు, వి.సుధాకర్‌యాదవ్, రమణయ్య యాదవ్, మల్లికార్జున్‌యాదవ్, వి.రాధయ్య తదితరులు స్వాగతం పలికారు.

జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలి: యూటీఎఫ్



తహసీల్దార్ కార్యలయం వద్ద ధర్నాలో యూటీఎఫ్ నాయకులు

సూళ్లూరుపేట, జూలై 15: విద్యా విధానంలో తీసుకొచ్చిన జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జీపీఎస్ జీవో 54 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులపై కక్షతో వైసీపీ ప్రభుత్వం అనేక ఇబ్బందులు పెట్టిందన్నారు. కొత్తగా వచ్చిన తమ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, సునీలా, మునీంద్ర, సునీల్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేటలో అన్నదానం

నాయుడుపేట, జూలై 15: ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 65వ జన్మదినం సందర్భంగా ఆయన భక్తులు అన్నదానం నిర్వహించారు. నాయుడుపేట దర్గారోడ్డులోని మెంటా మల్లికార్జున్ దుకాణం వద్ద అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా చాగంటి ప్రవచనాలను వినిపించారు.